


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 19-02-2025 | సంపుటి - 21 | సంచిక - 301 | రూ : 4 | పేజీలు: 8




# ఆక్వా రంగానికి గ్రీన్ ఎనర్జీ

- రైతులు టెక్నాలజీ అందిపుచ్చుకోవాలి
- బ్యాంకులు విరివిగా రుణాలు ఇవ్వాలి
- పద్ధతి ప్రకారం సాగు చేస్తే ప్రోత్సాహం
- తప్పు చేస్తే కఠిన చర్యలు తప్పవు
- జీఎఫ్ఎస్‌టీ ఆక్వా కాంక్లేవ్‌లో సీఎం

అమరావతి: ఆక్వా రైతులకు బ్యాంకు రుణాలిప్పిస్తామని.. ప్రైవేటు అప్పులకు వెళ్లకుండా చూసే బాధ్యత తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. 'పద్ధతి ప్రకారం ఆక్వా సాగు చేసుకుంటే సౌకర్యాలు కల్పించి ప్రోత్సహిస్తాం. తప్పు చేసేవారి విషయంలో కఠిన చర్యలు తీసుకుంటాం' అని స్పష్టం చేశారు. గ్లోబల్ ఫోరం ఫర్ సస్టెయినబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ (జీఎఫ్ఎస్‌టీ) ఆధ్వర్యంలో విజయవాడలో మూడు రోజులుగా జరుగుతున్న 'ఆక్వాకల్చర్ ఇన్నోవేషన్ టెక్ 2.0' కాంక్లేవ్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'ఆక్వా రంగం ద్వారా రైతులకు ఆదాయం, ప్రభుత్వానికి ఏటా రూ.1.30 లక్షల కోట్ల జీవీఏ అందుతున్నా.. కాలుష్యం వల్ల స్థానికంగా తాగడానికి నీరు పనికిరావట్లేదనే బాధ ఉంది. ఈ పరిస్థితి మారాలి. గ్రీన్ ఎనర్జీని అందిపుచ్చుకోవాలి. ఆక్వా ఫారాలు, పరిశ్రమల్లో పెద్దఎత్తున సౌర విద్యుత్తు ఉత్పత్తి చేయాలి' అని సూచించారు. 'ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో కొన్ని మాట్లాడలేకపోతున్నా. విద్యుత్తు ఛార్జీలు సహా.. ఆక్వారంగం విషయంలో త్వరలో కీలక నిర్ణయాలు తీసుకుంటాం. ఆక్వా రైతులకిస్తున్న రుణాలు రూ.3వేల కోట్లే. బ్యాంకులతో మాట్లాడి వీలైనంత ఎక్కువగా రుణాలు ఇప్పిస్తాం' అని తెలిపారు.

**ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ తప్పనిసరి**

'రాష్ట్రం నుంచి ఎగుమతి అయ్యే ఉత్పత్తేదీ ప్రపంచ మార్కెట్‌లో తిరస్కరణకు గురికాకూడదు. రైతులు సీడ్, ఫీడ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. యాంటీబయాటిక్స్‌ను పూర్తిగా నియంత్రించాలి. ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ విధానం అమలుచేయాలి' అని చంద్రబాబు సూచించారు. 'మొత్తం 60వేలమంది రైతులు ఉన్నారు. అందరూ సాగు నమోదు చేసుకోవాలి. అంతా అంగీకరిస్తే

తరువాయి 2లో

## సైబర్ భద్రతలో
# నంబర్-1 అవుతాం

- రాష్ట్రాన్ని సెక్యూర్ బిజినెస్ హబ్‌గా మార్చాలి
- డీప్ ఫేక్‌తో వైషమ్యాలు సృష్టించే కుట్రలను తిప్పికొట్టాలి
- 'షీల్డ్-2025' సైబర్ సెక్యూరిటీ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: సైబర్ నేరాల నియంత్రణలో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో సైబర్ భద్రతలో రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ), సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ) ఆధ్వర్యంలో హైదరాబాద్ హెచ్ఐసీసీలో మంగళవారం 'షీల్డ్ 2025' సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. 'గతేడాది సైబర్ నేరగాళ్లు దేశవ్యాప్తంగా రూ.22,812 కోట్లు దోచుకున్నారని ఒక అంచనా. ఇది మన ఆర్థిక వ్యవస్థతోపాటు పౌరులకూ ముప్పే. ఈ అంశంపై దేశవ్యాప్తంగా అందరూ సమన్వయంతో పనిచేయాల్సిన అవసరముంది. ఈ నేరాల నియంత్రణలో దేశంలో తెలంగాణ మొదటిస్థానంలో ఉంది. సైబర్ సెక్యూరిటీ బ్యూరోతో పాటు

తరువాయి 2లో




## టి-హబ్‌తో అంతర్జాతీయ
# స్టార్టప్ భాగస్వామ్యం

- సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో బ్రెజిల్ సంస్థతో ఒప్పందం

హైదరాబాద్: తెలంగాణలో స్టార్టప్‌ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. అంతర్జాతీయ భాగస్వామ్యమే లక్ష్యంగా బ్రెజిల్‌కు చెందిన 'గోయాస్ హబ్'తో..టిహబ్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మంగళవారం హెచ్ఐసీసీలో 'గో యాస్ హబ్' ప్రతినిధులతో చర్చలు జరిపారు. అనంతరం సీఎం, మంత్రి సమక్షంలో

తరువాయి 2లో






2లో

## శ్రీశైలంలో నేటి నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

- 23న సీఎం పట్టువస్త్రాల సమర్పణ

# ప్రతిభకే పట్టం

- 9 వర్సిటీలకు ఉపకులపతులను నియమించిన ప్రభుత్వం
- సామాజిక వర్గాలు, ఉన్నత విద్యావంతుల సమతూకం
- రాష్ట్ర చరిత్రలో మొదటిసారి ఎస్టీ ఎరుకల మహిళ ఎంపిక

2లో






# సైబర్ భద్రతలో నంబర్-1 అవుతాం

(మొదటి పేజీ తరువాయి)

హెల్ప్‌లైన్ ఉన్న అతికొద్ది రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. కేంద్రీకృత సైబర్ క్రైమ్ పోర్టల్ రూపకల్పనలో తెలంగాణ పోలీసులు కీలకపాత్ర పోషించారు. ఇప్పుడా సాంకేతికతను 27 రాష్ట్రాలు వినియోగిస్తున్నాయి. గతేడాది సుమారు 18 వేల మంది బాధితులు కోల్పోయిన సొమ్ములో రూ.183 కోట్లను తిరిగి ఇప్పించడంలో టీజీసీఎస్‌బీ కీలకంగా వ్యవహరించింది. హెల్ప్‌లైన్ నంబరు 1930 గురించి అందరికీ అవగాహన కల్పించేలా షేర్ చేయాలి. గతేడాది మా ప్రభుత్వం కొత్తగా 7 సైబర్‌క్రైమ్ పోలీస్ స్టేషన్‌లను ప్రారంభించింది' అని పేర్కొన్నారు. 'ఒకప్పుడు హత్యలు, అత్యాచారాలను తీవ్ర నేరాలుగా పరిగణించేవారు. సైబర్ నేరాలతో ఇప్పుడు తిజోరీ అర్థం మారిపోయింది. కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లే సైబర్ నేరస్థులకు తిజోరీలుగా మారిపోయాయి. వారిని గుర్తించడం.. పట్టుకోవడం.. శిక్షించడం.. ఇలా ప్రతిదీ సవాలుతో కూడుకున్నదే. దానికి తగ్గట్టుగా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి. ప్రభుత్వం, దర్యాప్తు, ఐటీ సంస్థలు సంయుక్తంగా పనిచేసి బలమైన సైబర్ భద్రత వ్యవస్థను రూపొందించాలి. డిజిటల్ భద్రతను మెరుగుపర్చేందుకు ఏఐ, బ్లాక్‌చైన్, క్లౌడ్ సెక్యూరిటీ పరిజ్ఞానం వినియోగించాలి. రాష్ట్రాన్ని సెక్యూర్ బిజినెస్ హబ్‌గా మార్చాలి. సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ ముందువరుసలోనే ఉన్నా ఇది సరిపోదు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు కనెక్టింగ్ బ్రిడ్జిలా ఉండాలి. ఆర్థిక నేరాలే కాకుండా సామాజిక మాధ్యమాల్లో నకిలీ వార్తల ప్రచారం సవాల్‌గా మారింది. కొందరు డీప్ ఫేక్ సాంకేతికతతో సమాజంలో వైషమ్యాల్ని సృష్టించే కుట్ర చేస్తున్నారు. అలాంటి ప్రయత్నాల్ని సమర్థంగా తిప్పికొట్టే సాంకేతికతను రూపొందించాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

* **త్వరలో కొత్త సెక్యూరిటీ పాలసీ: శ్రీధర్‌బాబు**

డేటా భద్రతకు సంబంధించి డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం మార్గదర్శకాలకు అనుగుణంగా త్వరలో కొత్త సెక్యూరిటీ పాలసీని తీసుకురాబోతున్నట్లు ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఏఐ టెక్నాలజీ సాయంతో గిగావాట్ డేటా సెంటర్‌ను నెలకొల్పేందుకు సంకల్పించామన్నారు. 'సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లను తయారు చేయడంలో ప్రపంచంలో భారత్ రెండో స్థానంలో ఉన్నా ఏటా 7 బిలియన్ డాలర్ల విలువైన ఫైర్‌వాల్ మొదలుకొని



యాంటీవైరస్ లాంటి సాఫ్ట్‌వేర్‌లను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడం ఆందోళనకరమైన అంశం. ఈ పరిస్థితిని నిపుణులు సమీక్షించాలి. కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. సాంకేతికత మెరుగవుతున్నకొద్దీ సవాళ్లూ పెరుగుతున్నాయి. మన గురించి మన కంటే ఎక్కువగా గూగుల్‌కు తెలుస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. సైబర్ మోసాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా సైబర్ నిపుణులను తయారు చేస్తున్నాం' అని పేర్కొన్నారు. హోంశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రవిగుప్తా మాట్లాడుతూ.. సైబర్ భద్రతను మెరుగుపరిచేందుకు మరింత పటిష్ఠ వ్యవస్థలు అందుబాటులోకి రావాల్సిన అవసరముందన్నారు. డీజీపీ డా.జితేందర్ మాట్లాడుతూ.. సైబర్ నేరాల నియంత్రణ, ఛేదనలో క్రైమ్ ఓఎస్ లాంటి ఏఐ ఆధారిత పరిజ్ఞానం దర్యాప్తు సంస్థలకు కీలకంగా మారిందని తెలిపారు. ర్యాన్సమ్‌వేర్, ఏఐ ఆధారిత దాడులు, ఆర్థిక నేరాలను నియంత్రించేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ల అవసరముందని చెప్పారు. టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయెల్ మాట్లాడుతూ.. త్వరలో ఐఐటీ హైదరాబాద్, నల్సార్, ఐఎస్‌బీ లాంటి సంస్థలతో ఒప్పందం చేసుకోబోతున్నామని వెల్లడించారు. గూగుల్‌తో జరగబోయే ఒప్పందం తెలంగాణ సైబర్ రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందన్నారు.

## ఆక్వా రంగానికి గ్రీన్ ఎనర్జీ

(మొదటి పేజీ తరువాయి)

రెండు మూడు నెలల్లోనే జియోట్యాగింగ్ పూర్తిచేస్తాం. రక్షణ రంగంలో ఆక్వా ఉత్పత్తుల్ని ప్రోత్సహించడంపై రక్షణ మంత్రిని కోరుతాం. ఆక్వాల్యాబ్స్ ఏర్పాటుకు కృషిచేస్తాం. విశాఖపట్నంలో క్వారంటైన్ ఏర్పాటుపైనా దృష్టిపెడతాం. మార్కెట్ లింకేజి, స్థానిక మార్కెట్ కల్పిస్తాం' అని పేర్కొన్నారు.

**ఆహారమే మందు.. వంట గదే ఫార్మసీ**

'ప్రతి ఇంట్లో తినే ఆహారమే మందు... వంట గదే మందుల దుకాణం(ఫార్మసీ) కావాలి. అప్పుడు వైద్యుల వద్దకు పోవాల్సిన అవసరమే ఉండదు. అలాంటి ఆహారపు అలవాట్లపై అధ్యయనం చేస్తున్నాం' అని చంద్రబాబు చెప్పారు. మారుతున్న ప్రజల ఆహారపు అలవాట్లు, ప్రపంచ అవసరాలకు అనుగుణంగా మన రైతులు పంటలు పండించాలని ముఖ్యమంత్రి సూచించారు.

## టిహబ్‌తో అంతర్జాతీయ స్టార్టప్ భాగస్వామ్యం

టిహబ్ సీఈవో సుజిత్, బ్రెజిల్‌కు చెందిన 'గోయాస్ హబ్' ప్రతినిధి జోస్ ఫ్రెడెరికో లైరా నెట్టో ఒప్పందంపై సంతకాలు చేశారు. 'ఈ ఒప్పందంతో తెలంగాణ స్టార్టప్‌లకు బ్రెజిల్‌లో, అలాగే బ్రెజిల్ స్టార్టప్‌లకు రాష్ట్రంలో అవకాశాలు లభిస్తాయి. ప్రధానంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐటీ, అగ్రిటెక్, హెల్త్ కేర్, బయోటెక్, మైనింగ్ రంగాల్లో పరస్పరం సహకరించుకుంటాయి. భారత్‌తోపాటు బ్రెజిల్ స్టార్టప్ ఎకో సిస్టంల మధ్య సంబంధాలను ఈ ఒప్పందం బలోపేతం చేస్తుంది' అని ఐటీ శాఖ వర్గాలు తెలిపారు.

## ప్రతిభకే పట్టం

అమరావతి: ప్రతిభకు ప్రాధాన్యమిస్తూ కూటమి ప్రభుత్వం విశ్వవిద్యాలయాల ఉపకులపతులను నియమించింది. రాష్ట్ర చరిత్రలో మొదటిసారి ఎస్టీ ఎరుకల వర్గానికి చెందిన మహిళ ప్రసన్నశ్రీని రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ వర్సిటీ వీసీగా ఎంపిక చేసింది. సామాజిక న్యాయానికి పెద్దపీట వేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని 17 వర్సిటీల వీసీలు స్వచ్ఛందంగా పదవీ విరమణ చేశారు. ఈ స్థానాల భర్తీ కోసం ప్రభుత్వం ఇటీవల ప్రకటన విడుదల చేసింది.

**ఉద్దండులకు పెద్దపీట**

అంతరిస్తున్న గిరిజన భాషలను కాపాడేందుకు ఆదికవి నన్నయ వర్సిటీ వీసీగా నియమితురాలైన ప్రసన్నశ్రీ కృషి చేశారు. గిరిజనుల్లోని భగత, గదబ, కొలామి తదితర తెగల భాషలకు ఆమె లిపి రూపొందించారు. ఈ లిపులకు గూగుల్ సైతం వెబ్‌సైట్‌లో ప్రత్యేక ప్రాధాన్యమిచ్చింది. అంతరిస్తున్న భాషల అట్లాస్‌ను రూపొందించిన భారతీయురాలిగా ఎన్‌డీజడ్ ఆల్ఫాబెట్ అట్లాస్ తయారుచేసి ఆమె గుర్తింపు పొందారు. ఎస్టీ ఎరుకల వర్గానికి చెందిన ఈ నిత్య పరిశోధకురాలికి వీసీ పదవి లభించింది. త్వరలో శతాబ్ది ఉత్సవాలు జరుపుకోనున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఐఐటీ ఖరగ్‌పూర్ గణితం ఆచార్యులు, ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ నియమితులయ్యారు. ఉన్నత విద్యలో అమెరికాఇండియా భాగస్వామ్యంపై పని చేసిన అనుభవమున్న నిట్ వరంగల్ ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్‌ను జేఎన్‌టీయూ కాకినాడ వీసీగా నియమించింది. లైఫ్ సైన్స్, బయోటెక్నాలజీల్లో పీహెచ్‌డీ, న్యూరోసైన్స్‌పై పరిశోధించిన ఫణితి ప్రకాశ్‌బాబును యోగి వేమన వర్సిటీ ఉపకులపతిగా ఎంపిక

# శ్రీశైలంలో నేటి నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామివార్ల ఉభయ దేవాలయాలను, మండపాలను రంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా ముస్తాబు చేశారు. బుధవారం (ఈ నెల 19 నుంచి) ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మార్చి ఒకటో తేదీ వరకు వైభవంగా జరగనున్నాయి. ఈనెల 23న సీఎం చంద్రబాబు ఉత్సవాల్లో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని అన్ని ఆర్జిత సేవలను రద్దు చేశారు. సాధారణ భక్తులకు శ్రీస్వామి అమ్మవార్ల అలంకార దర్శనం ఉంటుంది. ఉచిత దర్శనం, రూ.200 శీఘ్ర దర్శనం, రూ.500 అతిశీఘ్ర దర్శనం టిక్కెట్లు అందుబాటులో ఉంటాయి. జ్యోతిర్ముడి కలిగిన భక్తులకు చంద్రావతి కల్యాణ మండపం వద్ద నుంచి ఈనెల 23 వరకు మల్లికార్జునస్వామి స్పర్శ దర్శనం కల్పిస్తారు.

## అర్ధరాత్రి వేళ నిర్ణయాలా: సీఈసీ ఎంపికపై రాహుల్



భారత ఎన్నికల సంఘం నూతన సారథిగా జ్ఞానేశ్ కుమార్ నియమితులైన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ఎంపికపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. సీఈసీ ఎంపికపై సుప్రీం కోర్టులో విచారణ జరుగుతుండగానే.. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలు అర్ధరాత్రి వేళ నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. 'తదుపరి ఎన్నికల కమిషనర్ ఎంపికకు కమిటీ సమావేశంలో మోదీ, అమిత్‌షాలకు అభ్యంతరాల నివేదికను అందించాం. కార్యనిర్వాహక వ్యవస్థ జోక్యం లేని స్వతంత్ర ఎన్నికల కమిషన్‌లో అత్యంత ప్రాథమిక అంశం ఎన్నికల సంఘం కమిషనర్, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను ఎంపిక చేసే ప్రక్రియ. సుప్రీంకోర్టు ఆదేశాలు ఉల్లంఘిస్తూ.. అర్ధరాత్రి వేళ నూతన సీఈసీని ఎంపిక చేశారు. ఇది మన ఎన్నికల ప్రక్రియపై కోట్లాది ప్రజల్లోని ఆందోళనలను తీవ్రతరం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకంపై సుప్రీంకోర్టులో 48 గంటల్లో విచారణ జరగనుంది. ఈ క్రమంలో మోదీ సర్కారు తీసుకున్న నిర్ణయం సరికాదు' అని రాహుల్ రాసుకొచ్చారు. భారత ఎన్నికల సంఘం నూతన సారథిగా జ్ఞానేశ్ కుమార్, ఎలక్షన్ కమిషనర్‌గా వివేక్ జోషి నియమితులయ్యారు. మోదీ నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ (ఈసీ) పదవిని చేపట్టబోయే వ్యక్తుల పేర్లను ఖరారు చేసింది. ఈ కమిటీలో ప్రధాని మోదీతోపాటు కేంద్ర మంత్రి అమిత్ షా, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సభ్యులుగా ఉన్నారు. సీఈసీ, ఈసీ పదవులకు ఎంపిక చేసిన పేర్లను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు సిఫార్సు చేయగా ఆమె ఆమోదం తెలిపారు. కొత్త చట్టం ప్రకారం సీఈసీని నియమించడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై ఈ నెల 19న విచారణ జరగనుంది.

## ప్రధాని ని కలిసిన రిషి సునాక్ కుటుంబం



దిల్లీ: బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్ భారత ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. కుటుంబ సభ్యులతో రిషి సునాక్ కలిసిన ఫొటోలను ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్'లో షేర్ చేశారు. రిషి సునాక్, ఆయన కుటుంబ సభ్యులను కలవడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ భేటీలో తమ మధ్య అనేక అంశాలపై అద్భుతమైన సంభాషణ జరిగిందన్నారు. రిషి భారత్‌కు గొప్ప మిత్రుడని, ఇరు దేశాల సంబంధాలు బలపడాలని తపనకలిగిన వారంటూ మోదీ ప్రశంసించారు. రిషి సునాక్ వెంట ఆయన సతీమణి అక్షతామూర్తి, ఇద్దరు కుమార్తెలు, రాజ్యసభ ఎంపీ సుధామూర్తి ఉన్నారు. అంతకముందు రిషి సునాక్ కుటుంబ సభ్యులతో కలిసి పార్లమెంటు హౌస్‌ను సందర్శించారు. ఆయనకు లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ సాదర స్వాగతం పలికారు. పార్లమెంటు హౌస్ నిర్మాణ వైభవాన్ని తిలకించడంతో పాటు పలు గ్యాలరీలు, ఉభయ సభల గదులు, కాన్‌స్టిట్యూషన్ హాల్, సంవిధాన్ సదన్‌లను సందర్శించారు. భారత్ పర్యటనలో ఉన్న రిషి ఇటీవల తాజ్ మహల్‌ను సందర్శించిన విషయం తెలిసిందే.

## కశ్మీర్‌కు 'కరువు' ముప్పు! వాతావరణ శాఖ



శ్రీనగర్: అందాల కశ్మీరంలో ఈ ఏడాది ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. జనవరి, ఫిబ్రవరి నెలల్లో 80 శాతం లోటు వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో ఈ వేసవిలో స్థానికంగా కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. ''జనవరితోపాటు ఈ నెలలో కలిపి ఇప్పటివరకు 79 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఇలాగే పొడి వాతావరణం కొనసాగితే కశ్మీర్ లోయవాసులకు తాగు నీటితోపాటు సాగు జలాలకు ఇక్కట్లు తప్పవు'' అని వాతావరణ శాఖ వెల్లడించింది. జీలం, ఇతర నదుల్లో సాధారణ నీటి మట్టంతో పోలిస్తే ఈ ఏడాది ఒక మీటరు తక్కువ స్థాయిలో ప్రవాహం ఉన్నట్లు స్థానిక నీటి పారుదల, వరదల నియంత్రణ విభాగానికి చెందిన ఓ అధికారి వెల్లడించారు. మరో పక్షం రోజుల్లో వర్షం లేదా మంచు పడకుంటే పరి స్థితులు కష్టతరంగా మారే అవకాశం ఉందన్నారు. కశ్మీర్‌లో అనేక నదులు కనిష్ఠ స్థాయిలో ప్రవహిస్తున్నాయి. దక్షిణ కశ్మీర్‌లో కొన్ని ప్రాంతాల్లో నీటి వనరులు పూర్తిగా ఎండిపోయాయి. వీటికి సంబంధించి అనేక వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. మరోవైపు మంచు లేకపోవడంతో ఫిబ్రవరి 22 నుంచి ప్రారంభం కావాల్సిన 'ఖేలో ఇండియా' వింటర్ గేమ్స్‌ను వాయిదా వేసిన సంగతి తెలిసిందే.

## ఆ ఆరోపణల్ని నిరూపిస్తే రాజీనామా చేస్తా

: **భాజపా ఎమ్మెల్యేలకు దీదీ సవాల్**



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ వేదికగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీ భాజపా ఎమ్మెల్యేలకు సవాల్ విసిరారు. బంగ్లాదేశ్ ఛాందసవాదులతో తనకు సంబంధం ఉందని నిరూపిస్తే.. తన పదవికి రాజీనామా చేస్తానన్నారు. బంగ్లాదేశ్ ఛాందసవాదులతో చేతులు కలిపారంటూ భాజపా ఎమ్మెల్యేలు చేస్తున్న ఆరోపణలపై ప్రధాని నరేంద్ర మోదీకి ఫిర్యాదు చేస్తానని తెలిపారు. మంగళవారం అసెంబ్లీలో దీదీ మాట్లాడుతూ.. భాజపా తీరుపై విరుచుకుపడ్డారు. ''అసెంబ్లీలో మాట్లాడటానికి అనుమతించడంలేదని భాజపా ఎమ్మెల్యేలు దుష్ప్రచారం చేస్తున్నారు. విద్వేషాలను వ్యాప్తి చేయడానికి, ప్రజల్ని విభజించడానికి వారికి వాక్ స్వాతంత్ర్యం అనుమతించదు. భాజపా మతాన్ని తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోంది. నేను జాతీయ భద్రత లేదా విదేశాంగ విధానం వంటి అంశాల జోలికి వెళ్లను.. కానీ, అమెరికా నుంచి అక్రమవలసదారుల్ని గొలుసులతో బంధించి వెనక్కి పంపించడం సిగ్గుచేటు. వారిని అమెరికా నుంచి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం విమానాలు పంపాలి. భాజపా ఎమ్మెల్యేలు నన్ను ఎదుర్కొనేందుకు భయపడుతున్నారు.. అందుకే నేను సభలో మాట్లాడుతున్నప్పుడు బాయ్‌కాట్ చేసి వెళ్లిపోతున్నారు'' అని ఆక్షేపించారు.

## వాక్ స్వాతంత్ర్యం పేరుతో ఏదైనా మాట్లాడుతారా?

* **యూట్యూబర్ రణ్‌వీర్‌కు 'సుప్రీం' ప్రశ్న!**

దిల్లీ: వివాదాస్పద యూట్యూబర్ రణ్‌వీర్ అల్హాబాదియాపై సుప్రీంకోర్టుతీవ్రస్థాయిలో విరుచుకుపడింది. వాక్‌స్వాతంత్ర్యం పేరుతో సామాజిక కట్టుబాట్లను గాలికొదిలేసి నోటికొచ్చింది మాట్లాడతారా? అని మండిపడింది. 'ఇండియాస్ గాట్ లాటెంట్'(IGL) కార్యక్రమంలో పాల్గొన్న ఓ వ్యక్తిని తల్లిదండ్రుల గురించి, శృంగారంపై ప్రశ్నించిన తీరు పట్ల దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అల్హాబాదియాపై పలు రాష్ట్రాల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు కావడంతో పాటు బెదిరింపులు వస్తుండటంతో అతడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. దీంతో ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిపిన సర్వోన్నత న్యాయ స్థానం అరెస్టు నుంచి అతడికి రక్షణ కల్పిస్తూ పలు ప్రశ్నలు సంధించడమే కాకుండా కీలక ఆదేశాలు జారీ చేసింది.

# అక్రమ సంబంధం హత్య కేసులో ఐదుగురికి జీవిత ఖైదీ, జరిమానా..

* **సంచలన తీర్పు ఇచ్చిన 3వ అదనపు జిల్లా జడ్జి, ఫ్యామిలీ కోర్టు జడ్జీ దుర్గాప్రసాద్..**





ప్రజాస్ఫూర్తి నల్లగొండ :ప్రియుడు అతని స్నేహితులతో కలిసి భర్తను హత్య చేసిన కేసులో భార్య, ప్రియుడితో సహా మొత్తం ఐదుగురి జీవిత ఖైదుతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ 3వ జిల్లా అదనపు జడ్జి దుర్గాప్రసాద్ మంగళవారం తీర్పునిచ్చినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. 1జూలై 2019న అర్ధరాత్రి సమ యంలో పథకం ప్రకారం నల్లగొండ వన్టేన్ పీఎస్ పరిధిలోని గందవారి గూడెం రోడ్డులో ఉన్న సోమ కేశవులు భార్య స్వాతితో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఇదే క్రమంలో స్వాతి పట్టణానికి చెందిన దుబ్బ ప్రదీప్ అనే వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుని తమ అక్రమ సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని భావించి ఆమె తన భర్త కేశవులును అడ్డు తొలగించుకునేందుకు ప్రియుడు దుబ్బ ప్రదీప్ అతని స్నేహితులైన కొడిదేటి శివకుమార్, కుంభం ప్రసాద్, చింతపల్లి నగేష్లతో కలిసి పథకం వేశారు. వారు అనుకున్న పథకం ప్రకారం 1 జూలై 2019వ తేదీన రాత్రి స్వామి భర్త కేశవులు ఇంటి హాల్లో పడుకున్న సమయంలో వారు వెంట తెచ్చుకున్న సుత్తితో కేశవులు ఛాతిపై బలంగా కొట్టి ఆధారులు లేకుండా రూపుమాపాలనే ఉద్దేశంతో నేర పూరితంగా హతమార్చారన్నారు. మృతుని తండ్రి సోమ నాగులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై వన్టేన్ పోలీసులుకేసు నమోదు చేసి దర్యాప్త అనంతరం సరైన ఆధారాలు కోర్టుకి సమర్పించారు. మంగళవారం జిల్లా న్యాయస్థానంలో విచారణ అనంతరం నిందితులకు జీవిత ఖైదూతో పాటు రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారన్నారు. ఈ కేసులో సరైన ఆధారాలు సేకరించి కోర్టుకి అందజేసి నిందితులకు శిక్ష పడే విధంగా చేసిన అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ నిగిడాల సురేష్, డీఎస్పీ శివరాంరెడ్డి, ప్రస్తుత సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్రెడ్డి, ప్రాసిక్యూషన్ తరుపున పీపీ జి.జవహార్లాల్, కోర్టు డ్యూటీ ఆఫీసర్లు వి.శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, లైనసింగ్ ఆఫీసర్లు హెచ్సీ పాక నరేందర్, పీసీ మల్లిఖార్జున్లను జిల్లా ఎస్పీ అభినందించారు.

## నూతన సిఐగా భాధ్యతలు చేపట్టిన రాజేష్ కు శుభాకాంక్షలు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి ) : నూతన సిఐ గా బాధ్యతలు చేపట్టిన రాజేష్ ను మంగళవారం భారతీయ జనతా పార్టీ వివేకానంద నగర్ డివిజన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. అనంతరం పుష్పగుచ్చాలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు సహకరించాలని, నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై సతీష్ రెడ్డిని శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వివేకానంద నగర్ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ వంశీ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వై. భాస్కర్ రెడ్డి నేతలు మల్లికార్జున్ రెడ్డి, సిహెచ్.వేణుగోపాల్, బి.కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి విధానం అరికట్టాలి

- **దామెరలో జలసాధన సమితి కరపత్రాల ఆవిష్కరణ**
- **మన్నే నరసింహారెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి.. భూగర్భ జలాలను పెంచడంతో పాటు నీటి వృధాను అరికట్టాలని మన్నె నరసింహారెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం దామెర గ్రామపంచాయతీ పరిధిలోని బాలాజీ ఫంక్షన్ హాల్ లో బోయిన ముత్యాలు యాదవ్ అధ్యక్షతన శ్రీ శ్రీ అంధోల్ మైసమ్మ జలసాధన సమితి కరపత్రాలను జలసాధన సమితి నాయకులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మన్నె నరసింహారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో సాగునీరు లేక వరి పంట ఎండిపోతున్నాయన్నారు. ఈ మధ్య కాలంలో చాలా బోర్లు వేసామని, భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో చుక్క నీరు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీవాలకు పశుగ్రాసం దొరకడం లేదని వాపోయారు. గ్రామ ప్రజలు పార్టీలకతీతంగా ఒక్క తాటిపైకి రావాలని సూచించారు. గ్రామాలలో తక్షణమే కమిటీ వేసుకొని భవిష్యత్తు కార్యాచరణకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రభుత్వాన్ని శాంతియుతంగా ఒప్పించి సాగు నీళ్ళని సాధించాలన్నారు. ఈ సమావేశంలో మల్లేపల్లి షణ్ముఖ్ రెడ్డి, మన్నె చిత్ర సేనా రెడ్డి, దోనూరు జైపాల్ రెడ్డి, చేకూరి ఈద్దయ్య, గట్టు వెంకటేష్, గుండెబోయిన సత్యనారాయణ, జాల నరసింహ, నారెడ్డి అంజిరెడ్డి, మదిరెడ్డి గోవర్దన్ రెడ్డి, సమితి సభ్యులు కంచరకుంట్ల వెంకట్ రెడ్డి, ముత్యాల భూపాల్ రెడ్డి, కొంతం అనంత రెడ్డి, మాజీ సర్పంచ్ గోపి సుధాకర్, మెట్టు సుదర్శన్ రెడ్డి, మారగోని అశోక్ గౌడ్ గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ నాయకుడు అమరజీవి కామ్రేడ్ వేదగిరి శ్రీనివాసరావు

* **తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం.**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఆదర్శ నాయకుడు అమరజీవి కామ్రేడ్ వేదగిరి శ్రీనివాసరావు ఆశయాల సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు అన్నవరపు కనకయ్య లు పిలుపునిచ్చారు, మంగళవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంచికంటిభవన్ లో వేదగిరి శ్రీనివాసరావు 5వ వర్ధంతి సభ జరిగింది, ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా ఉపాధ్యక్షులు అన్నవరపు కనకయ్య పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు, అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి గా, రాష్ట్ర కమిటీ, జాతీయ కౌన్సిల్ సభ్యులు గా పని చేశారన్నారు, అనేక కూలి పోరాటాలకు, భూమి పోరాటాలకు నాయకత్వం వహించిన ఆదర్శ నాయకుడని కొనియాడారు, అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ కార్మికుల సమస్యల పై జరిగిన అనేక పోరాటాలలో ప్రత్యక్షంగా పాల్గొన్నారని తెలిపారు, భవిష్యత్తులో వేదగిరి స్ఫూర్తితో భూమి పోరాటాలు, కూలి పోరాటాలు, ఇండ్ల స్థలాల పోరాటాలు ఉద్ధృతం చేస్తామని అదే ఆయనకిచ్చే ఘన నివాళి అన్నారు, బ్రతికినంత కాలంలో పేదల కోసం జీవించిన మహా నాయకుడని అన్నారు,ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కాలంగి హరిక్రిష్ణ,వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోట బాలకృష్ణ, జబ్బ సంధ్య,నసూర్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల రక్షణ, శాంతి భద్రత పరిరక్షణే పోలీసు శాఖ లక్ష్యం

- **సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి**
- **గోపాల్ పల్లెలో మీ కోసం పోలీస్ కార్యక్రమం**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ప్రజల రక్షణ, శాంతి భద్రత పరిరక్షణే పోలీసు శాఖ లక్ష్యమని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి అన్నారు. ముస్తాబాద్ మండలంలోని గోపాల్ పల్లె గ్రామంలో మీకోసం పోలీస్ కార్యక్రమాన్ని ముస్తాబాద్ ఎస్సై సిహెచ్.గణేష్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా సిసి కెమరాల ప్రాముఖ్యత, రోడ్డు యాక్సిడెంట్లు, సైబర్ క్రైమ్, అక్రమ దందాలపై అవగాహన కల్పించారు. ఒక సిసి కెమరా వంద మంది పోలీసులతో సమానమని, సిసి కెమరాల ఏర్పాటు చేసుకుంటే ఏదైనా నేరం జరిగిన సమయంలో నిందితులను గుర్తించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. సిసి కెమరాలు ఏర్పాటు చేస్తే నేరాలు తగ్గు ముఖం పడతాయని అన్నారు. చాలా వరకు రోడ్డు ప్రమాదాలు నిర్లక్ష్యం, అతి వేగం వల్లనే జరుగుతాయని, హెల్మెట్ ధరించకపోవడం, సీటు బెల్ట్ పెట్టుకోకపోవడం కారణంగా ఆయా ప్రమాదాల్లో మృత్యువాత పడే అవకాశాలుంటాయని తెలిపారు. రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరు తప్పకుండా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, కార్లలో వెళ్లేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, వాహనానికి సంబంధించిన ప్రతి ఒక్క ధృవీకరణ పత్రం వెంట ఉంచుకోవాలని, లైసెన్సులు కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, సెల్ఫోన్ డ్రైవింగ్ చేయవద్దని, పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావద్దని సూచించారు. యువత గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలుగా మార్చి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, నిషేధిత గంజాయి, మాదకద్రవ్యాలు, గుడుంబాపై ఎలాంటి సమాచారం ఉన్న స్థానిక పోలీసులకు అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు సైబర్ నేరాల పట్ల ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని, తద్వార వాటి బారిన పడకుండా ఉండవచ్చని తెలిపారు. ఓటిపిలు చెప్పడం, అనుమానాస్పద లింకులను ఓపెన్ చేయడం ద్వారా సైబర్ నేరాలకు గురవుతారని, రోజుకో కొత్త తరహాలో సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలను టార్గెట్ చేస్తున్నారని, ప్రజలు ఇలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే పోలీసులకు సమాచారం అందించాలని, ఆకతాయిలు మహిళలను వేధిస్తే వారి భరతం పడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితకు చౌటుప్పల్ లో ఘన స్వాగతం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బీఆర్ఎస్వి నాయకులు మంగళవారం చౌటుప్పల్ లో ఘన స్వాగతం పలికారు. సూర్యాపేట జిల్లాలో జరుగుతున్న పెద్దగట్టు జాతరకు వెళ్తున్న కల్వకుంట్ల కవితకు మార్గమధ్య చౌటుప్పల్ బస్టాండ్ ఆవరణ జాతీయ రహదారిపై బిఆర్ఎస్వి మునుగోడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ముటుకులోజు రాఘవ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించారు. కారులో నుంచే బీఆర్ఎస్వి శ్రేణులకు అభివాదం చేశారు. అనంతరం పెద్దగట్టు జాతరకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వి మున్సిపల్ అధ్యక్షుడు తొర్పునూరి నరసింహ గౌడ్, మహమ్మద్ ఫరాన్, ఇమిడి ఈశ్వర్, విజయ్ కుమార్, పన్నాల శశిధర్ రెడ్డి, గంగాదేవి శివ, ఊదరి రాకేష్, కోడూరి చరణ్, ఇమ్రాన్, శ్యామల చింటూ తదితరులు పాల్గొన్నారు.

## కులాలకు అతీతంగా హిందూ ధర్మ రక్షకులకు అండగా ఉంటాం

* **టీ ఎస్ సి వి రాష్ట్ర అధ్యక్షుడు నర్రి స్వామి**



యాదాద్రి భువనగిరి , ప్రజాస్ఫూర్తి : మునుగోడు నియోజకవర్గం పర్యటనలో భాగంగా సంస్థ నారాయణపురం లోని శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణేశ్వరి ఆశ్రమం లో ఆధ్యాత్మిక గురువు రామకృష్ణ పరమహంస జన్మదినాన్ని పురస్కరించుకొని శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణేశ్వర ఆశ్రమ పీఠాధిపతులు శ్రీ శ్రీ శంకరానంద స్వామి వారి అధ్యక్షతన భారతదేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వివిధ పీఠాలకు చెందిన స్వామీజీలు సమావేశం జరిగింది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ లైబ్రరీ కార్యదర్శి మునుగోడు నియోజకవర్గ కంటెస్టెండ్ ఎమ్మెల్యే అభ్యర్థి హైకోర్టు ప్రముఖ న్యాయవాది నర్రి స్వామి పాల్గొని మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న స్వామీజీలకు సన్యాసులకు పీఠాధిపతులకు మఠాధిపతులకు న్యాయపరమైనటువంటి సలహాలు అందజేస్తూ సామాజికంగా ప్రజలను ఉత్తేజపరుస్తూ హిందూధర్మ రక్షణకు పాటుపడుతున్నటువంటి వ్యక్తులందరికీ అండగా ఉంటాం నాకు తెలియజేశారు సనాతన ధర్మం సర్వేజనా సుఖినోభవంతు అంటూ సకల జనుల యొక్క సుఖ సంతోషాలను కోరుకుంటుంది కాబట్టి ఈ భారతదేశం పైన పుట్టిన ప్రతి ఒక్కరు ఆత్మ స్వరూపుడే కాబట్టి కులాలకు మతాలకు అతీతంగా హిందూ ధర్మ రక్షణకు పాటుపడే వారికి అండగా ఉంటామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో భారత దేశవ్యాప్తంగా వివిధ మఠలకు వివిధ పీఠాలకు చెందిన స్వామీజీలు శ్రీ శ్రీదయానందగిరి స్వామి, శ్రీ కైవల్య దత్త నందగిరి స్వామి, శ్రీ బ్రహ్మశ్రీ వీర ధర్మజ స్వామి, శ్రీ జయ దేవానంద స్వామీజీ, అనేకమంది మాతాజీలు స్వామీజీలు తదితరులు పాల్గొన్నారు

## కుదువ పెట్టిన పుస్తెలతాడు దొరకడంతో రైతుకు అందజేసిన బ్యాంకు మేనేజర్



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజాపేట పట్టణ కేంద్రంలోని ఎస్. బి. ఐ. బ్యాంకులో కాకర్ల కమరాకర్ దంపతులు కుదువ పెట్టిన పుస్తెలతాడును ఎట్టకేలకు కనుగొన్న బ్యాంకు మేనేజర్ మంగళవారం రైతుకు అందజేశారు. 11 నెలల క్రితం కాకర్ల కమలాకర్ అనే రైతు నాలుగు తులాల పుస్తెలతాడు కుదవపెట్టి మూడు లక్షల రూపాయలు లోన్ తీసుకున్నారు. గత శనివారం వడ్డీ అసలు చెల్లించేందుకు బ్యాంకుకు కమలాకర్ రాగా కుదవ పెట్టిన బంగారు పుస్తెలతాడు దొరకపోవడంతో బ్యాంకు మేనేజర్ గడువు అడిగి ఎట్టకేలకు సోమవారం రాత్రి దొరకబట్టారు. కుదువ పెట్టిన బంగారం భద్రంగా ఏర్పాటు చేసిన సంచి నంబర్ నమోదు చేయడంలో అస్పష్టత ఉండడంతో ఈ గందరగోలం పరిస్థితి నెలకొందని బ్యాంకు మేనేజర్ ఉస్మాన్ పాష తెలిపారు. సుమారు 900 మంది అకౌంట్లు ఉన్నాయని అందుకే కొంత జాప్యం జరిగిందని మేనేజర్ తెలిపారు.

## కనీస వసతులు లేని, నిర్లక్ష్యం సిబ్బందితో కొనసాగుతున్న పెట్రోల్ బంక్




రాజపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న రీ ఫిల్లింగ్ సెంటర్ కనీస వసతులు లేకుండా, నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందితో కొనసాగుతుండడంతో వినియోగదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం వివిధ వాహన చోదకులు విలేకరులకు తమ ఇబ్బందులను తెలియజేశారు. గతంలో రెండుసార్లు తక్కువ పెట్రోల్ డీజిల్ పోవడంతో సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్న విషయం గుర్తు చేశారు. ప్రస్తుతం నిబంధనల ప్రకారం పెట్రోల్ బంకు కొనసాగకపోవడమే కాకుండా పనిచేస్తున్న సిబ్బంది ప్రవర్తన ఇబ్బందికరంగా ఉందని స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

## కుంభమేళాలో పవిత్ర స్నానమాచరించిన వెంకయ్యనాయుడు దంపతులు

ఢిల్లీ: ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాలో మంగళవారం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు దంపతులు.. కుమారుడు హర్షవర్ధన్, మనుమరాలు నిహారికలతో కలిసి పవిత్ర స్నానం ఆచరించారు. త్రివేణీ సంగమం వద్ద పుణ్యస్నానం ఆచరించడం అలౌకిక ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించినట్టు ఆయన పేర్కొన్నారు. "ప్రపంచంలోని అతిపెద్ద ఆధ్యాత్మిక సమ్మేళనాల్లో ఒకటైన మహాకుంభమేళా యుగయుగాల భారతీయ సనాతన వారసత్వానికి ప్రతీక. ఇక్కడ ఆచరించే స్నానం సకల శుభాలను అందిస్తుందన్నది భారతీయుల విశ్వాసం" అని ఆయన వెల్లడించారు.

# పూర్తి స్థాయిలో కుల గణన సర్వే నిర్వహించాలి

* **బీసీ కమిషన్ సభ్యురాలు బాల లక్ష్మీ**



మేడ్చల్, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వేను పూర్తి స్థాయిలో నిర్వహించి, క్షేత్ర స్థాయిలో ఖచ్చితమైన వివరాలను పొందుపరచాలని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యురాలు బాల లక్ష్మీ సూచించారు. మంగళవారం మేడ్చల్ నియోజకవర్గం పీర్జాదిగూడ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ కులగణన సర్వేలో పాల్గొనని వారు మరియు సర్వే పై ఆసక్తి చూపని వారిని గుర్తించి వారికి అవగాహన కల్పించి మళ్లీ వారిని సర్వే చేయాలని సూచించారు, ఎనుమరేటర్లు సర్వేను సమగ్రంగా పూర్తి చేయడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కుల గణన సర్వే ప్రత్యేక కౌంటర్ ను సందర్శించి కుల గణన ప్రొఫార్మాలను పరిశీలించారు, ఈ సర్వే ద్వారా ప్రభుత్వం నిర్దిష్ట గణాంకాలను సేకరించి, భవిష్యత్తు అభివృద్ధి కార్యక్రమాలను రూపుదిద్దుకునే అవకాశం ఉంటుందని ఆమె వివరించారు.ఈ సమావేశంలో మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్ రావు, మేడ్చల్ జిల్లా బీసీ డెవలప్మెంట్ అధికారి ఝాన్సీ, మున్సిపల్ అధికారులు, ఎనుమరేటర్లు, వార్డ్ అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి జన్మదిన వేడుకలు



కూకట్ పల్లి , (ప్రజాస్ఫూర్తి) : ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, ప్రపంచ కార్మిక సంగం ఉపాధ్యక్షులు జి. సంజీవరెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి, జాతీయ కార్యదర్శి భాస్కర్ రెడ్డి ఆయనకు పూల బొకే అందజేసి శాలువతో సత్కరించి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ వివిధ దేశాలలో ట్రేడ్ యూనియన్ సమస్యలకు సంబంధించి జరిగిన అనే సమావేశాలు, సమ్మిట్ లు, ఫోరమ్‌లలో భారతదేశం తరపున సంజీవరెడ్డి ప్రాతినిధ్యం వహించారన్నారు. దేవుడు ఆయనకు ఆరోగ్యం సంతోషకరమైన పరిపూర్ణ జీవితాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నానని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాగన్న గౌడ్, చంద్రశేఖర్, ఆదిల్ , షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు శ్రీశ్రీశ్రీ సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: లక్ష్మీదేవిపల్లి మండలం హరిత హోటల్ ప్రాంగణంలో బుధవారం 19వ తేదీ ఉదయం10 గంటలకు జరిగే శ్రీశ్రీశ్రీ సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాలకు బంజార జాతి బిడ్డలుమాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్లు మాజీ కౌన్సిలర్లు,మాజీ ప్రజా ప్రతినిధులు గిరిజన సంఘ గిరిజన నాయకులు ప్రజా సంఘాల ఉద్యమకారులు ఉద్యోగులు విద్యార్థులు మేధావులు సంత్ శ్రీ సాధువులు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరు ఆరాధ్యదైవం శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ సమాజ శ్రేయస్సు కోసం చూపించిన మార్గం ఆదర్శనీయం ఆ మహనియుడి 286వ జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంలేని సాంబశివరావు , జిల్లా ఉన్నతాధికారులు గిరిజన సంఘాల నాయకులు హాజరవుతున్నారు , ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు భూక్య శ్రీనివాస్. భూక్యా రాంబాబు. రమేష్ రాథోడ్. భానోత్ మోహన్. రమేష్ నాయక్ జర్పుల ఉపేందర్. బానోత్ సక్రు. శివ. గుగులోత్ బద్రు. మాలోత్ రామనాథం. ఉపేందర్. బట్టు ఉషన్. అంగోత్ నగేష్. దుర్గాప్రసాద్. బానోత్ పరశురాం. బానోత్ భరత్. భూక్యా వంశీకృష్ణ. భుక్య లక్ పతి. తదితరులు పాల్గొన్నారు.

# పరారయ్యాడంటూ.. సతీష్ రెడ్డిపై సోషల్ మీడియాలో ప్రచారం

- **అసత్య ప్రచారమంటూ ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు**
- **బ్రతికుండగానే.. చంపేస్తున్నారంటూ కన్నీటి పర్యంతమైన సతీష్ రెడ్డి**






చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కాలానికి అనుగుణంగా రోజురోజుకు టెక్నాలజీ పరంగా ముందుకు సాగుతున్నాం. సోషల్ మీడియా వాడకం సైతం విరివిగా పెరిగింది. కానీ, జిహ్వకో రుచి.. పుర్రెకో బుద్ధి అనే విధంగా కొంతమంది అత్యుత్సాహంతో సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పిఏ దేవి రెడ్డి సతీష్ రెడ్డి దంపతులు రూ.40కోట్లతో పరారయ్యాడంటూ సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం సాగింది.

* **రూ.40కోట్లతో పరాడయ్యాడంటూ వాట్సాప్ లో ప్రచారం**

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పిఏగా మునుగోడు మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన దేవి రెడ్డి సతీష్ రెడ్డి 16సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం వాట్సప్ గ్రూపులలో బ్రేకింగ్ న్యూస్ రూ.40 కోట్లతో రాజగోపాల్ పిఏ జంప్ , రూ.40 కోట్ల రూపాయలతో ఉడాయించిన కాంగ్రెస్ ఎమ్మెల్యే పీఏ దంపతులు గోవాలో క్యాసినో పేరిట భారీ మొత్తంలో 40 కోట్లు వసూళ్లు చేసి పరారైన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పీఏ దేవిరెడ్డి సతీష్ రెడ్డి దంపతులు అంటూ విస్తృతంగా ప్రచారం జరిగింది. తేరుకున్న కాంగ్రెస్ నాయకులు అట్టి సమాచారం తప్పు అని, ఎవరో కావాలనే బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, అసత్య ప్రచారమని వాట్సప్ గ్రూప్ లలో సమాచారం పెట్టిన లాభం లేకుండా పోయింది. దావానంలా మునుగోడు నియోజకవర్గం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చెక్కర్లు కొడుతూనే ఉంది.

* **బ్రతికుండగానే చంపేస్తున్నారు**
- **దేవిరెడ్డి సతీష్ రెడ్డి**

వాట్సాప్ లో చెక్కర్లు కొడుతున్న విషయం తెలుసుకున్న దేవిరెడ్డి సతీష్ రెడ్డి వెంటనే ఆ ప్రచారం పూర్తిగా అసత్యమని సోషల్ మీడియాలో చెప్పే ప్రయత్నం చేశారు. అప్పటికే చేజారిపోవడంతో, రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ లో అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఎదురుగా మీడియాకు ఒక వీడియోను విడుదల చేశారు. సోషల్ మీడియాలో అత్యుత్సాహంతో కొంతమంది కావాలనే అసత్య ప్రచారం చేస్తున్నారని బాధపడ్డారు. ప్రస్తుతం తాను హైదరాబాద్ లోనే, ఉన్నానని, తాను ఎక్కడికి వెళ్లలేదని తెలిపారు తెలిపారు. బ్రతికుండగానే చంపేస్తున్నారు అంటూ కన్నీటి పర్యంతమయ్యాడు.

**తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకునేది లేదు**

- **పబ్బు రాజు గౌడ్, కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జ్**

కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ మునుగోడు నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్ హెచ్చరించారు. అసత్య ప్రచారం చేస్తున్న వారిపై ఫిర్యాదు చేశామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రచారాలు పునరావృతమేతే సహించేది లేదన్నారు. సోషల్ మీడియా వేదికగా కావాలనే బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, నాయకులు కార్యకర్తలు సంయమనం పాటించాలని సూచించారు.

# వేసవిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా కార్యచరణ రూపొందించాలి

* **రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: రానున్న వేసవిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా కార్యచరణ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి ఇతర ముఖ్య కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో సాగునీరు, త్రాగునీరు, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ సరఫరా, రైతు భరోసా, రబీ సీజన్ కు సాగునీటి సరఫరా, యూరియా కొరత, రేషన్ కార్డుల జారీ, రెసిడెన్షియల్ పాఠశాలల సందర్శన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ వచ్చే వేసవికాలం దృష్ట్యా ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా కార్యచరణ రూపొందించి నిరంతరం నీటిని అందించే విధంగా ప్రణాళిక బద్ధంగా అమలు చేయాలని తెలిపారు. రబీ సీజన్ కొరకు సాగునీటి సమస్య లేకుండా ప్రాజెక్టులు, చెరువులపై సమీక్షించి ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. వ్యవసాయ సాగులో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ఈ నేపథ్యంలో యూరియా కొరత లేకుండా చూడాలని తెలిపారు. వేసవికాలంలో వ్యవసాయానికి, త్రాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. అర్హత గల ప్రతి రైతుకు రైతు భరోసా అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజాపాలనలో రేషన్ కార్డుల కొరకు వచ్చిన దరఖాస్తులలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గురుకుల పాఠశాలలను జిల్లా అధికారులు సందర్శించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు.ఐ డి ఓ సి కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన జడ్పీ సీఈవో నాగలక్ష్మి , జిల్లా అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ రంగానికి, త్రాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, జిల్లాలో విద్యుత్ వినియోగంపై అధికారులతో సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రైతు భరోసా పథకం క్రింద అర్హులైన అందరికీ పథకం అందించే విధంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు చేపడుతున్నామని, రేషన్ కార్డుల కొరకు ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రక్రియ పూర్తి చేసి శాసనమండలి సభ్యుల ఎన్నికల ప్రవర్తన నియమావళి ముగిసిన వెంటనే అర్హులైన వారందరికీ అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వేసవిలో ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా జిల్లాలోని మారుమూల ప్రాంతాల వరకు నీటిని అందించేందుకు అధికారుల సమన్వయంతో కార్యచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, మిషన్ భగీరథ ఈ ఈ లు తిరుమలేష్, నలిని,జిల్లా విద్యుత్ శాఖ అధికారి జి. మహేందర్ , నీటి పారుదల శాఖ ఈ ఈ రాంప్రసాద్, పౌర సరఫరాల శాఖల అధికారులు త్రినాధ్ బాబు, రుక్మిణి, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన స్వామి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు..





శేర్లింగంపల్లి: ప్రజాస్ఫూర్తి : శేర్లింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ అక్రమ నిర్మాణాలకు అడ్డగా మారింది. 10లో సంఖ్యలో నిర్మాణాలు జరుగుతున్న జిహెచ్ఎంసి అధికారులు మాత్రం నిమ్మకునీనెక్కినట్లు వ్యవహరిస్తున్నారు. మియాపూర్, లక్ష్మి నగర్, కాలనీ న్యూ కాలనీ, మయూరి నగర్, బి కే ఎంక్లేవ్ రెడ్డి కాలనీ ,నాగార్జున కాలనీలలో అక్రమ నిర్మాణాలు యదేచ్ఛగా జరుగుతున్న అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొన్నిచోట్ల అక్రమ సెల్లార్లు సైతం తీసి నిర్మాణాలు చేపడుతున్న జిహెచ్ఎంసి సిబ్బంది ఎందుకు పట్టించుకోవడం లేదు అర్థం కావడం లేదంటూ స్థానికులు వాపోతున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు దృష్టి పెట్టే అధికారులు ముందు జాగ్రత్తగా ఫిర్యాదులు వచ్చిన ఎందుకు పట్టించుకోవడం లేదంటూ నిలదీస్తున్నాం. ఈ నిర్మాణాలపై జిహెచ్ఎంసికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదంటూ హైడ్రాన్ ఆశ్రయించినట్లు తెలుస్తోంది. మరోవైపు జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు ప్యాకేజ్ మాట్లాడుకొని మరి నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. అందుకే టౌన్ ప్లానింగ్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని తెలుస్తోంది. ఏది ఏమైనా మియాపూర్ డివిజన్ లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని స్థానికులు వేడుకుంటున్నారు.

# గిరీష్ కుమార్కు జన్మదిన శుభాకాంక్షలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కె ఎస్ ఆర్ వీరాభిమాని ఫేస్ 2 గిరీష్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం తన అభిమాన నాయకుడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా కె ఎస్ ఆర్ ఆయనను దీవించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రాజు (మీసాల రాజు), బాలకృష్ణ, ప్రభాకర్,మహేష్ యాదవ్, ఎం సత్యవతి, ఎన్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు

# కూకట్ పల్లి సిఐ రాజేష్కు శుభాకాంక్షలు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్ పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్గా రాజేష్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మంగళవారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రేస్ కమిటీ రాష్ట్ర నాయకులు చిరుమర్తి రాజు, గ్రేటర్ హైదరాబాద్ స్వచ్ఛ ఆటో టిప్పర్ యూనియన్ నాయకులు అల్వాల రమేష్, రౌడీ మల్లేశ్, గుండ్లకొండ బాలు, మైలపాక అంజి లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# కుల గణన సర్వే అందరికీ ఉపయోగపడాలి



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : కుల గణన సర్వే అందరికీ ఉపయోగపడాలని శేర్లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ కూన సత్యం గౌడ్ , శేర్లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శిరీష సత్తూర్ లు అన్నారు. సమగ్ర కుల సర్వే నిర్వహించి, ఓబీసీల సాధికారత కోసం డేటాను ఉపయోగించాలనే చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కుల గణన కార్యక్రమం దేశానికి దిశా నిర్దేశంగా ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో దేశంలోనే ప్రధమంగా మొదలుపెట్టి రికార్డ్ సృష్టిస్తూ విజయవంతంగా పూర్తి చేసిన బీసీ కుల గణన సర్వే సందర్భంగా మంగళవారం తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ , రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో బాలాగౌడ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం

* కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరమని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ అన్నారు. కూకట్పల్లి నియోజక వర్గం మూసాపేట్ లో నివాసం ఉండే భూసాని శ్రావణి ఎర్రమంజిల్ లోని ఏఐజీ హాస్పటల్ లో చేరి చికిత్స పొందారు. చికిత్స అనంతరం వారు కూకట్ పల్లి లోని గొట్టిముక్కల వెంకటేశ్వరరావు ని వారి కార్యాలయంలో సంప్రదించగా కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధి కి దరఖాస్తు చేయించారు. దీంతో వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రెండు చెక్కులు రూ.54 500,(21000+33500) ల మంజూరు అయినవి. అట్టి చెక్కులను మంగళవారం బండి రమేష్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రమేష్ గుప్త కి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. సీఎం సహాయనిధి ఆపదలో ఉన్న వారికి అప్పన్న హస్తంలా అందుకుంటుందన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేష్ కి, నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు లకి బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, శివా చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ శ్రీ శ్రీ విజయ గణపతి సహిత శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయ అష్టదశ వార్షికోత్సవ వేడుకలు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : బాలానగర్ డివిజన్ పరిధిలోని నవజీవన్ నగర్ కాలనీ లో గల శ్రీ శ్రీ శ్రీ విజయ గణపతి సహిత శ్రీ ఉమామహేశ్వర స్వామి వార్ల ఆలయమునందు నూతన శ్రీ సిద్ధి బుద్ధి సహిత విజయ గణపతి ప్రతిష్టాపన సహిత ఆవాహిత ఉమామహేశ్వర శ్రీ బాల త్రిపుర సుందరి, పంచముఖి ఆంజనేయ స్వామి వారి అష్టదశ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమం లో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వద్దేపల్లి రాజేశ్వరరావు పాల్గొని, ఆలయంలో ఉన్న విగ్రహ దేవత మూర్తుల దివ్యదర్శనమును గావించి వారి కృప కటాక్షాలకు పాత్రులైనారు, అనంతరం ఆలయ అభివృద్ధిలో తన సహకారం అందించిన వద్దేపల్లి రాజేశ్వరరావు ని ఆలయ ప్రధాన అర్చకులు రాఘవేంద్ర శర్మ వేదఆశీర్వచనం ఇవ్వగా, కాలనీ అధ్యక్షులు తాండ్ర అరుణ్ బాబు ఘనంగా సన్మానించి ధన్యవాదాలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో బిజెపి మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శంకర్ రెడ్డి, బాలనగర్ డివిజన్ అధ్యక్షులు డాక్టర్ కిరణ్, డివిజన్ నాయకులు శ్రీశైలం, శ్రీనివాస్, నవజీవన్ నగర్ కాలనీ ప్రధాన కార్యదర్శి టీవీ భాస్కర్ రెడ్డి, సభ్యులు శ్రీరామమూర్తి, రాజ్ కుమార్, శ్రావణ్ కుమార్,

# పదవ తరగతి ఫలితాలు భవిష్యత్ లక్ష్యాలకు మార్గదర్శకాలు

* జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: పదవ తరగతి ఫలితాలు విద్యార్థుల భవిష్యత్తు యొక్క లక్ష్యాలు సాధించడానికి మార్గదర్శకాలు అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం పట్టణంలోని అంబేద్కర్ భవన్ షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణ, శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత కలెక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలనతో తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాల్లో ఎన్ని మార్కులు వస్తాయి అని విద్యార్థులు ఆలోచించకుండా వారి భవిష్యత్తు లక్ష్యాలను చేరుకోవడానికి కష్టపడి చదవాలని అన్నారు.. నిరంతరం కష్టపడుతూ ఉంటే లక్ష్యాలను సాధించుకోవచ్చని అన్నారు. తాను కూడా విద్యార్థి దశలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నానని,పదవ తరగతి చదువుకునేటప్పుడు ఒక మంచి ఇంజనీర్ అవుదామని అనుకున్నాను, తర్వాత నా లక్ష్యాలను మార్చుకొని పట్టుదలతో చదివి ఐఏఎస్ సాధించానని తన అనుభవాన్ని విద్యార్థులతో కలెక్టర్ పంచుకున్నారు. వసతి గృహాల్లో ఉండే విద్యార్థుల కోసం ప్రత్యేక స్టడీ హవర్స్, ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను నియమించి నిపుణులతో ప్రేరణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పరీక్షలకు కొన్ని రోజులే సమయం ఉన్నందున సమయాన్ని వృధా చేయవద్దన్నారు. విద్యార్థులు టీవీ, ఫోన్, సోషల్ మీడియా లాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు సమన్వయంతో చదువుకోవాలన్నారు. వెనుకబడిన విద్యార్థులు పై ప్రత్యేక దృష్టి సాధించాలని, హాస్టల్లో విద్యార్థులను హాస్టల్ వార్డెన్లు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించి జిల్లాలో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా శిక్షణ అందించాలని కలెక్టర్ అన్నారు.అనంతరం విద్యాశాఖ రిసోర్స్ పర్సన్ లు సైదులు, నాగరాజు శేఖర్, నాగరాజు, విజయ భాస్కర్, శ్యాం చందర్ రావు లు విద్యార్థులకు శిక్షణ తరగతుల్లో వివిధ సబ్జెక్టుల్లో మెలకువలు నేర్పారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారిని అనసూర్య, ఏ ఎస్ డబ్ల్యూ ఓ లు హనుమంతరావు, సునీత, హెచ్ డబ్ల్యు ఓ లు గజ్వేల్ శ్రీనివాస్, పద్మావతి, శశిరేఖ, కౌసల్య,రామ నరసయ్య, స్వప్న, కార్యాలయ సిబ్బంది నరసింహారావు, పార్వతి శశికళ, హేమంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# విద్యతో పాటు.. క్రీడల్లో రాణించాలి

- ఘనంగా ట్రినిటీ పాఠశాల ప్రాథమిక విద్యార్థుల స్పోర్ట్స్ మీట్
- మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు








చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: విద్యార్థులు విద్యతో పాటు.. క్రీడల్లో కూడా రాణించాలని చౌటుప్పల్ మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లకారంలోని వివిఆర్ ఫంక్షన్ హాల్ లో ట్రినిటీ పాఠశాల ప్రాథమిక విద్యార్థులకు స్పోర్ట్స్ మీట్ 2025 మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చౌటుప్పల్ మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి స్పోర్ట్స్ మీట్ ను ప్రారంభించారు. చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. ఈ సందర్భంగా ఆటల పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి విద్య, క్రీడలు రెండింటిలో ముందుండాలన్నారు. చిన్ననాటి నుంచే క్రీడలపై మక్కువ పెరిగేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ట్రినిటీ పాఠశాల చైర్మన్ కెవిబి కృష్ణారావు, పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ ఉజ్జిని మంజుల లను ప్రత్యేకంగా అభినందించారు. చిన్న వయసు నుంచే పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించడం ఖాయమన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, చౌటుప్పల్ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రినిటీ పాఠశాల చైర్మన్ కెవిబి కృష్ణారావు, పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ ఉజ్జిని మంజుల, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ట్రస్ట్ కార్యదర్శి యానాల ప్రభాకర్ రెడ్డి, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ట్రస్ట్ మండల చైర్మన్ వెన్ రెడ్డి సంధ్య రాజు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం అందించే ఆరోగ్య సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలి

* మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ సీ. ఉమా గౌరి



మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : ప్రభుత్వం అందించే ఆరోగ్య సేవలను మరింత సమర్థవంతంగా అమలుచేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ సీ. ఉమా గౌరి అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డీఎంహెచ్ఓ కార్యాలయంలో మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ సీ. ఉమా గౌరి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కీసర, మల్కాజిగిరి డివిజన్ డిప్యూటీ జిల్లా వైద్య ,ఆరోగ్య అధికారులు, జిల్లా ఆరోగ్య కార్యక్రమ అధికారులు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో పనిచేస్తున్న డిప్యూటీ సివిల్ సర్జన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించే ఆరోగ్య సేవలు ప్రజలకు మరింత చేరువ అయ్యేలా అవసరమైన సూచనలు అందించారు.

# మరో ఐదు జిల్లాలకు అధ్యక్షులను ప్రకటించిన భాజపా

హైదరాబాద్: తెలంగాణలో భాజపా మరో ఐదు జిల్లాలకు పార్టీ అధ్యక్షులను ప్రకటించింది. జిల్లా అధ్యక్షులతో పాటు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులను కూడా నియమించింది. మొత్తం మూడు విడతల్లో 28 జిల్లాలకు అధ్యక్షులను ప్రకటించిన పార్టీ అధిష్ఠానం.. మరో 10 జిల్లాలకు అధ్యక్షులను పెండింగ్‌లో పెట్టింది. భాజపాకు సంస్థాగతంగా తెలంగాణలో 38 జిల్లాలు ఉన్నాయి. నారాయణపేట జిల్లా అధ్యక్షుడిగా కె.సత్యయాదవ్, సూర్యపేట శ్రీలతరెడ్డి, సిద్దిపేట బైరి శంకర్ ముదిరాజ్, సిరిసిల్ల ఆర్.గోపి ముదిరాజ్ నియ



మితులయ్యారు.

# తెలంగాణ హైకోర్టులో వాదనలు వినిపిస్తూ కుప్పకూలిన న్యాయవాది

హైదరాబాద్: తెలంగాణ హైకోర్టులో విషాద ఘటన చోటు చేసుకుంది. కోర్టు హాలులో న్యాయవాది కుప్పకూలిన ఘటన తోటి న్యాయవాదులను కలచి వేసింది. వివరాల్లోకి వెళితే.. న్యాయవాది వేణుగోపాలరావు 21వ కోర్టు హాలులో ఓ కేసుకు సంబంధించి వాదనలు వినిపిస్తున్న సమయంలో ఒక్కసారిగా కూప్పకూలారు. గమనించిన తోటి న్యాయవాదులు వెంటనే అతన్ని అంబులెన్స్‌లో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వేణుగోపాలరావు గుండెపోటుతో మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. న్యాయవాది మృతికి సంతాప సూచకంగా 21వ కోర్టులో పిటిషన్ల



విచారణను న్యాయమూర్తి నిలిపివేశారు. మిగతా కోర్టుల్లోనూ అత్యవసర పిటిషన్లు, పాస్ ఓవర్ పిటిషన్లను విచారించి.. రెగ్యులర్ పిటిషన్లను వాయిదా వేశారు.

# కృష్ణాజలాలను ఏపీ అక్రమంగా తరలిస్తోంది.. కేంద్రం అడ్డుకోవాలి: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్: కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరగ కుండా కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కోరారు. ఏపీ ప్రభుత్వం కృష్ణాజలాలను అక్ర మంగా తరలిస్తోందని, కేంద్రం అడ్డుకోవాలన్నారు. జయపురలో కేంద్ర జలశక్తిశాఖ ఆధ్వర్యంలో జరిగిన నీటిపారుదలశాఖ మంత్రుల సమావేశంలో పాల్గొన్న ఉత్తమ్.. నీటి నిల్వ సదుపాయాలు, నీటి సరఫరా నిర్వహణపై ప్రజెంటేషన్ ఇచ్చారు. కృష్ణా జలాల వినియోగాన్ని లెక్కించేందుకు టెలిమెట్రీ ఏర్పాటు చేయాలని కోరారు. 55 కిలోమీటర్ల పొడవునా చేపడుతున్న మూసీ పునరుజ్జీవ, అభివృద్ధి ప్రాజెక్టుకు కేంద్రం నిధులివ్వాలని.. గంగా, యమునా పునరుద్ధరణ తరహాలో మూసీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని మంత్రి అన్నారు. మూసీ వెంట ట్రంక్, సీవరేజ్ నెట్ వర్క్ కోసం రూ.4వేల కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌కు గోదావరి జలాలను తరలించే పనులకు రూ.6వేల కోట్లు ఇవ్వాలని కోరారు. కృష్ణా ట్రైబ్యునల్ తీర్పు త్వరగా వచ్చేలా కేంద్రం చొరవ తీసుకొని తెలంగాణకు న్యాయం చేయాలన్న ఉత్తమ్.. పాలమూరు రంగారెడ్డి, సమ్మక్క సారక్క, సీతారామసాగర్ ప్రాజెక్టులకు నీటి కేటాయింపుల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పనులు కొనసాగుతోన్న సాగునీటి ప్రాజెక్టులకు తక్కువ వడ్డీతో రుణాలు సమకూర్చాలని, రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల్లో పూడికతీ తకు అయ్యే వ్యయాన్ని కేంద్రమే భరిం చాలని కోరారు. మేడిగడ్డ ఆనకట్టకు సంబంధించి ఎన్డీఎస్ఏ విచారణ నివేదిక త్వరగా ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వానికి తగిన కార్యాచరణ సూచించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.



# బార్లీ నీటితో ప్రయోజనాలెన్నో

ఎండలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. వేడిమి తాపంతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తుంటాయి. వేసవి వేడిని తగ్గించడానికి, ఆరోగ్య సమస్యలకు చెక్ పెట్టడానికి బార్లీ వాటర్ ఎంతగానో ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. బార్లీ నీరు వల్ల చాలా ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది కొలెస్ట్రాల్ తగ్గించడంలో సాయపడుతుంది. గట్ బాక్టీరియాను సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది. మన ఆరోగ్యంలో గట్ బ్యాక్టీరియా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. బార్లీ ఆధారిత ఆహారాన్ని తీసుకోవడం వల్ల బాక్టీరాయిడ్స్ అనే గట్ బ్యాక్టీరియా తగ్గుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. శరీర వేడిని తగ్గించి తక్షణ శక్తిని అందించే గుణాలు బార్లీ వాటర్‌లో మెండుగా ఉంటాయి. బార్లీలో ఫైబర్, క్యాల్షియం, ఐరన్, మాంగనీస్, మెగ్నీషియం, జింక్, కాపర్, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు తగినతంగా కలిగి ఉంటాయి. సమ్మర్ లో బార్లీ వాటర్ తాగితే ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉ



### అజీర్తిని దూరం చేస్తుంది

బార్లీ వాటర్ రక్తపోటును అదుపులో ఉంచుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచి.. టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. మధుమేహం ఉన్నవారు తమ రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించేందుకు బార్లీ వాటర్ తాగొచ్చు. ఎండల ప్రభావం పడకుండా ఉండాలన్న, వడదెబ్బ తగలకుండా ఉండాలన్న ఈ నీళ్లు తాగాల్సిందే. బార్లీ నీళ్లు తాగితే జీర్ణాశయం కూడా చాలా శుభ్రపడుతుంది. అజీర్తి దూరమవుతుంది. పిల్లలకు బార్లీ నీళ్లు తాగిస్తే మంచి ఫలితం ఉంటుంది. మలబద్దకం వంటి సమస్యలు దరి చేరవు. గర్భిణులు రోజూ బార్లీనీళ్లు తాగితే మరీ మంచిది. కాళ్ల వాపు సమస్య వారి దరిచేరదు. రోజులో ఉదయం, సాయంత్రం బార్లీ నీళ్లు తాగితే బిడ్డ ఆరోగ్యం కూడా బాగుంటుంది. అలసట కూడా త్వరగా రాదు. బరువు తగ్గాలనుకునే వారికి కూడా బార్లీ నీళ్లు బాగా ఉపయోగపడతాయి. రక్తంలో కొలెస్ట్రాల్ శాతాన్ని తగ్గిస్తాయి. దీని ద్వారా గుండె సంబంధిత వ్యాధులు దూరంగా ఉంటాయి. మహిళలను తరచూ బాధించే ప్రధాన సమస్య మూత్రనాళ ఇన్ఫెక్షన్. ఈ సమస్యను దూరం చేసుకోవాలంటే ప్రతి రోజు ఉదయాన్నే గ్లాసు బార్లీ నీళ్లు తాగితే మంచి ఫలితం ఉంటుంది. మూత్రంలో ఇన్ఫెక్షన్లు కలిగే కారకాలు, వ్యర్థాలు బయటికి పోతాయి. చిన్న చిన్న రాళ్లు కూడా కరిగిపోతాయి.

### కొలెస్ట్రాల్ తగ్గిస్తుంది

బార్లీ వాటర్ లేదా బార్లీ టీ తాగడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. బార్లీలో ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్‌ను అణచివేసి, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచే రసాయనాలను టోకాల్స్ అని పిలుస్తారు. బార్లీ నీరు గుండె జబ్బుల సంభవాన్ని తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. ఎందుకంటే పానీయంలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు గుండెపై ఆక్సీకరణ ఒత్తిడితో పోరాడుతాయి. పానీయం గుండె జబ్బులు మరియు అధిక కొలెస్ట్రాల్ రెండింటినీ సమర్థవంతంగా పోరాడటానికి సహాయపడుతుంది.



### రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది

బార్లీ నీరు రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుందని రుజువు చేసే వివిధ పరీక్షలు ఉన్నాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులు శరీరంలో బ్లడ్ షుగర్ స్పైక్‌ను నియంత్రించడానికి తీపి లేని బార్లీ నీటిని క్రమం తప్పకుండా తాగాలి. బార్లీ నీరు మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రయోజనం చేకూరుస్తుంది, ముఖ్యంగా రక్తంలో చక్కెరను నిర్వహించడం ద్వారా మరియు పరిస్థితి వల్ల వచ్చే మరిన్ని వ్యాధులను నివారించడం. పానీయంలోని యాంటీ ఆక్సిడెంట్లు ఒక వ్యక్తిలో ప్రీ డయాబెటిస్‌ను రివర్స్ చేయడానికి కూడా సహాయపడతాయి. అయితే, పానీయంలో చక్కెర లేదా స్వీటెనర్లు లేవని నిర్ధారించుకోవాలి.



## జిమ్‌కు వెళ్తున్నారా..?
# ఈ విషయాలు తెలుకోండి

ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతీ ఒక్కరు ప్రయత్నిస్తుంటారు. ఇందులో భాగంగానే చాలా మంది ఉదయాన్నే జాగింగ్ , యోగాలు, జిమ్‌లకు వెళ్తున్నారు. డైలీ లైఫ్‌లో ఇది ఒక భాగంగా మారింది. కానీ ముఖ్యంగా సమ్మర్‌లో కొన్ని జాగ్రత్తలు తప్పకుండా పాటించాలి. చాలా మంది యువత ఉదయాన్నే జిమ్‌లకు వెళ్తారు. ఉదయం లేవగానే కొందరు బనానా తిని జిమ్‌కు వెళ్తారు. ఇది ఎంతో ప్రమాదకరం. ఇలా అస్సలు చేయకూడదు. అరటి తొందరగా జీర్ణం కాదు. అందుకు కేవలం పరగడుపున నీళ్లు తాగి జిమ్‌కు వెళ్లాలి. జిమ్‌లో కోచ్ చెప్పినట్లు విధంగా వర్కవుట్ చేయాలి.



కొందరు అతిగా వర్కవుట్లు చేస్తుంటారు. ఇలా చేయడం వల్ల కూడా అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. శరీరానికి అవసరమైన పోషకాలు, విటమిన్లు ఉండే ఫుడ్‌ను తీసుకోవాలి. జిమ్ తర్వాత గుడ్లు, బనానాలు తినవచ్చు. కానీ కొందరు ఓవర్ నైట్‌లో మంచి స్ట్రక్చర్ రావాలనుకుంటారు. దీనికోసం మాత్రలను వాడుతారు. ఇలాంటివి వాడటం వల్ల లేని ప్రమాదం కలుగుతుంది. జిమ్‌లలో కోచ్ చెప్పిన విధంగానే ఫుడ్ హ్యాబిట్లు అలవాటు చేసుకోవాలి. స్టేప్ బై స్టేప్ బరువులను పెంచుకుంటూ వర్కవుట్లు చేయాలి. కానీ కొందరు మాత్రం.. ప్రారంభించిన రోజునే భారీగా బరువులు ఎత్తుతుంటారు. దీని వల్ల కండరాలు పట్టేసుకుంటాయి. జిమ్ చేసేటప్పుడు లేదా జాగింగ్ చేసేటప్పుడు మధ్యలో గ్యాప్ ఇవ్వాలి.



గొంతు తడారి పోకుండా కొన్ని నీళ్లను తాగుతుండాలి. ఎక్కువగా బరువులు ఎత్తకుండా చూసుకోవాలి. కొందరికి బీపీ, డయాబెటిక్ సమస్యలు ఎక్కువగా ఉంటాయి. అలాంటి వారు ఎక్కువగా డాక్టర్ల సూచనల మేరకు మాత్రమే జిమ్‌లో వర్కవుట్లు చేయాలి. ముఖ్యంగా జిమ్‌లు, జాగింగ్‌లు చేసే వారు.. పెసర్లు, శనగలు, గుడ్లు, అరటి పండ్లు, పాలు, నాన్ వెజ్ ఎక్కువగా తీసుకోవాలి. రాత్రిపూట బాగా తినాలి. అదే విధంగా జిమ్‌లో గంటలు గంటలు వర్కవుట్స్ చేయకూడదు. ఇలా చేస్తే గుండె జబ్బులు, హెల్త్ ప్రాబ్లమ్స్ వచ్చే సూచనలున్నాయి.

## లాభాలకు బ్రేక్.. మళ్లీ నష్టాల్లో ముగిసిన మార్కెట్లు..



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ నష్టాల్లోకి జారుకుతున్నాయి. ఎనిమిది రోజుల తర్వాత.. సోమవారం స్వల్ప లాభాల్లో ముగియగా.. మంగళవారం మళ్లీ నష్టాల్లో ముగిశాయి. ఐటీ, పవర్ రంగాల సూచీలు రాణించి.. విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, గ్లోబల్ మార్కెట్లలో నెలకొన్న భయాల నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. ఫలితంగా మార్కెట్లు నష్టాల్లోకి జారుకున్నాయి. గత సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ మంగళవారం ఉదయం 76,073.71 స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. ఆ తర్వాత కొద్దిసేపటికే నష్టాల్లోకి జరుకున్నాయి. మధ్యాహ్ననికి కోలుకొని స్వల్ప నష్టాల్లో ముగిశాయి.

ఇంట్రాడేలో 75,531.01 పాయింట్ల కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. గరిష్ఠంగా 76,091.69 పాయింట్లకు పెరిగింది. చివరకు 29.47 పాయింట్ల నష్టంతో 75,967.39 వద్ద ముగిసింది. నిఫ్టీ 14.20 పాయింట్లు తగ్గి.. 22,945.30 స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 993 షేర్లు పెరగ్గా.. మరో 2,804 షేర్లు పతనమయ్యాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.2శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 1.7శాతం క్షీణించాయి. నిఫ్టీలో ట్రెంట్, ఇండస్ ఇండ్ బ్యాక్, ఎం అండ్ ఎం, అల్ట్రాటెక్ సిమెంట్, భారత్ ఎలక్ట్రానిక్స్ టాప్ లూజర్స్‌గా నిలిచాయి. టెక్ మహీంద్రా, విప్రో, ఓఎన్‌జీసీ, పవర్ గ్రిడ్, ఎన్‌టీపీసీ లాభపడ్డాయి. సెక్టార్లలో ఫార్మా, ఎఫ్‌ఎంసీజీ, మీడియా, పీఎస్‌యూ బ్యాంక్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ 0.5-1 శాతం మధ్య పతనమవగా.. ఐటీ, పవర్, ఆయిల్, గ్యాస్ ఇండెక్స్ 0.5శాతం చొప్పున పెరిగాయి.

## మోదీ-మస్క్ భేటీతో కీలక పరిణామం..

### భారత్‌లో నియామకాలు చేపట్టిన టెస్లా




**న్యూఢిల్లీ:** ప్రపంచంలోనే అతిపెద్ద విద్యుత్తు ఆధారిత కార్ల తయారీ సంస్థ టెస్లా భారత మార్కెట్లోకి ప్రవేశించేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే భారత్‌లో ఈ సంస్థ నియామకాల ప్రక్రియ చేపట్టింది. ఈ విషయాన్ని టెస్లా లింక్డిన్ పోస్ట్ ద్వారా ప్రకటించింది. ఢిల్లీ, ముంబై నగరాల్లో వివిధ పోస్టుల్లో ఉద్యోగాల భర్తీ చేస్తున్నట్టు వెల్లడించింది.

కస్టమర్ రిలేటెడ్, బ్యాక్ఎండ్ జాబ్ సహా 13 ఉద్యోగాల భర్తీకి అభ్యర్థులు కావాలంటూ ప్రకటన చేసింది. ఇందులో సర్వీస్ టెక్నీషియన్, సలహదారు పోస్టులు వంటి వాటికి ఢిల్లీ, ముంబై నగరాల్లో నియామకాలు చేపడుతున్నట్లు తెలిపింది. మిగిలిన పోస్టులకు ఉద్యోగులను కేవలం ముంబై కేంద్రంగా తీసుకోనున్నట్లు ప్రకటనలో పేర్కొంది. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటీవలే అమెరికాలో పర్యటించిన విషయం తెలిసిందే. రెండు రోజుల పర్యటనలో భాగంగా టెస్లా బాస్ ఎలాన్ మస్క్‌తో భేటీ అయ్యారు. ఆ భేటీలో వాణిజ్య అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా టెస్లా భారత్‌లో ప్రవేశానికి సంబంధించిన కీలక అంశాలను కూడా ఇరువురూ ప్రస్తావించినట్లు సమాచారం. మోదీతో భేటీ అయిన రోజుల వ్యవధిలోనే టెస్లా ఈ చర్యలు చేపట్టడం విశేషం.

ఎలన్ మస్క్ సారధ్యంలోని టెస్లా భారత మార్కెట్‌లోకి అడుగుపెట్టేందుకు ఎంతోకాలంగా ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. భారత్ విధించే దిగుమతి సుంకాలు తమకు అడ్డంకిగా మారాయని టెస్లా గతంలోనే పేర్కొంది. అయితే, 40 వేల డాలర్లకు పైబడిన ఖరీదైన కార్లపై భారత్ ఇప్పటివరకూ 110 శాతం బేసిక్ కస్టమ్స్ డ్యూటీని విధించింది. ఇటీవల దాన్ని 70 శాతానికి తగ్గించింది.

## త్వరలో రూ.లక్షకు చేరుకోనున్న పది గ్రాముల బంగారం..




**న్యూఢిల్లీ:** పసిడి పరుగులు ఆగట్లేదు. ఊహించిన దానికంటే వేగంగా పరిగెడుతోంది. తొలిసారి 89 వేల రూపాయల మార్కు తాకి, ఆల్ టైమ్ హైని టచ్ చేసింది గోల్డ్. నేను మాత్రం తక్కువ తిన్నానా అన్నట్లు వెండి కూడా పరుగులు తీస్తోంది. ఈ పసిడి పరుగులు ఎందాకా? లక్షను టచ్ చేసి ఆగుతుందా? ఇంకా ముందుకు సాగుతుందా?

సప్త సముద్రాలు దాటి ఉన్న ఒక దేశ అధ్యక్షుడు ప్రపంచవ్యాప్తంగా బంగారం ధరను శాసిస్తున్నాడు. అవును, ఇది పూర్తిగా నిజం. అమెరికాలో కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తలుచుకుంటే, భారతదేశంలో తులం బంగారం (10 గ్రాములు) ధర లక్ష రూపాయలు దాటుతుంది. ఎలా అనుకుంటున్నారా? భారతదేశంతో సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలలో బంగారం ధర ఆకాశానికి అంటుతోంది. త్వరలోనే 10గ్రాముల బంగారం ధర రూ. లక్ష దాటడం ఖాయంగా కనిపిస్తోంది

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి, లండన్‌లోని థ్రెడ్ స్ట్రీట్ కింద ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద బంగారు నిల్వ నుండి అమెరికా బంగారాన్ని ఆర్డర్ చేయడం ప్రారంభించింది. ఈ విధంగా, ఇప్పటివరకు 8,000 బంగారు కడ్డీలు అమెరికాలోని న్యూయార్క్ గోల్డ్ రిజర్వ్‌కు చేరుకున్నాయి. దీని కారణంగా న్యూయార్క్ గోల్డ్ రిజర్వ్ 17.5 మిలియన్ ట్రాయ్ ఔన్సుల నుండి 34 మిలియన్ ట్రాయ్ ఔన్సులకు పెరిగింది.

ప్రపంచంలోనే అతిపెద్ద బంగారు నిల్వ లండన్‌లోని థ్రెడ్ నీడిల్ స్ట్రీట్ కింద ఉంది. ఇక్కడ, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ ఖజానాలలో రూ.22 లక్షల కోట్ల విలువైన బంగారం నిక్షిప్తం చేయడం జరిగింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెద్ద వ్యాపారవేత్తలు తమ బంగారాన్ని ఈ బ్యాంకులో దాచుకుంటారు. అటువంటి పరిస్థితిలో, అమెరికా తన బంగారాన్ని వెనక్కి తీసుకోవడం రాబోయే రోజుల్లో దాని ధర పెరుగుతుందని సూచిస్తుంది.

అమెరికా తన బంగారు నిల్వలను పెంచుకుంటున్న తీరును బట్టి చూస్తే, రాబోయే రోజుల్లో డోనాల్డ్ ట్రంప్ బంగారం దిగుమతులపై భారీగా సుంకం విధించవచ్చని స్పష్టమవుతోంది. ఇది జరిగితే అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర పెరగడం సహజం. గత కొన్ని నెలల్లో భారతదేశంలో బంగారం దిగుమతులు 41 శాతం పెరిగాయి. దీని కారణంగా, రాబోయే రోజుల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. లక్ష దాటవచ్చంటున్నారు బులియన్ మార్కెట్ నిపుణులు.

# ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ.. ఈ ఐదుగురిపైనే అందరి దృష్టి..!




**న్యూఢిల్లీ:** ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి భారత్ సిద్ధమైంది. ఐసీసీ ఈవెంట్‌లో ఎనిమిది జట్లు టైటిల్ రేసులో ఉన్నాయి. ఈ సారి చాంపియన్స్ ట్రోఫీని ఎలాగైనా సాధించాలని రోహిత్ శర్మ నేతృత్వంలోని టీమిండియా కసితో ఉన్నది. ప్రతీ ఐసీసీ ఈవెంట్‌లో ఎవరో ఒక ప్లేయర్ అద్భుతాలు చేస్తూ వెలుగులోకి వచ్చిన సందర్భాలున్నాయి. ఈ సారి చాంపియన్స్ ట్రోఫీలో అందరి దృష్టి కేవలం ఐదుగురు ప్లేయర్లపైనే ఉన్నది.

### శుభ్‌మన్ గిల్‌పై టీమిండియా ఆశలు..

టీమిండియా గిల్‌పై భారీగానే ఆశలు పెట్టుకుంది. ఇప్పటి వరకు భారత్ తరఫున 50 వన్డేల్లో ఏడు సెంచరీలు, 15 హాఫ్ సెంచరీలు చేశాడు. వన్డే ఫార్మాట్‌లో 60 సగటు, 101 స్ట్రయిక్ రేట్‌తో 2587 పరుగులు చేశాడు. ఈ ఫార్మాట్‌లో కెప్టెన్ రోహిత్ శర్మ, సీనియర్ ఆటగాడు విరాట్ కోహ్లీ ఇద్దరూ గిల్‌కు మార్గదర్శకత్వం చేయనున్నారు. 2022 నుంచి వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లలో శుభ్‌మన్ గిల్ ఒకడు. 47 మ్యాచుల్లో 63.45 సగటు, 102.87 స్ట్రయిక్ రేట్‌తో 2538 పరుగులు చేశాడు.

### ట్రావిస్ హెడ్ ఎలా ఆడుతాడో..?

గత కొన్నేళ్లుగా ఆస్ట్రేలియా ఆటగాడు ట్రావిస్ హెడ్ అద్భుతంగా రాణిస్తున్నాడు. ఐసీసీ టోర్నీల్లో బ్యాట్‌తో అద్భుతాలు సృష్టించాడు. నాకౌట్ మ్యాచ్‌లలో భారత్‌ను ఇబ్బందులకు గురి చేశాడు. పాకిస్తాన్‌లో బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌లపై హెడ్ మరోసారి బౌలర్లపై విరుచుకుపడేందుకు సిద్ధమయ్యాడు. టీమిండియా అభిమానులు వన్డే ప్రపంచకప్ ఫైనల్ ఇప్పటికీ గుర్తుంటుంది. ప్రత్యర్థి జట్లను దెబ్బతీసే సామర్థ్యం ట్రావిస్ హెడ్‌కు ఉంది.

### సల్మాన్‌పైనే పాక్ అంచనాలు..

దాయాది దేశం పాకిస్తాన్ సల్మాన్ అఘా సగటు ఆశలు పెట్టుకుంది. ఇటీవల కాలంలో లాహోర్ బ్యాటర్ దుమ్ములేపుతున్నాడు. చాంపియన్స్ ట్రోఫీలోనూ తనదైన ముద్ర వేస్తాడని టీమ్ మేనేజ్‌మెంట్ నమ్మకం. దక్షిణాఫ్రికాతో జరిగిన ముక్కోణపు తొలి సెంచరీని నమోదు చేశాడు. దక్షిణాఫ్రికాపై 350 పరుగులకుపైగా లక్ష్యాన్ని ఛేదించే సమయంలో బ్యాట్‌తో రాణించాడు.

### న్యూజిలాండ్ నుంచి డెవాన్ కాన్వే..

న్యూజిలాండ్‌కు చెందిన డెవాన్ కాన్వే వన్డేల్లో ఆడింది తక్కువ మ్యాచులే. ఇప్పటి వరకు 33 మ్యాచులు మాత్రమే ఆడాడు. క్రీజులోకి వచ్చిన తక్కువ సమయంలోనే కుదురుకొని గ్యాప్‌లోకి బంతులను పంపే సత్తా ఉన్నది. ముఖ్యంగా స్పిన్ బౌలింగ్‌లో అద్భుతంగా బ్యాటింగ్ స్తాడు. పాకిస్తాన్, దుబాయిలోనైనా ఆడగల సామర్థ్యం ఉంది. ఇటీవల ఆసియా పర్యటనలతో ఇక్కడి పిచ్‌లపై అవగాహన వచ్చింది. కాన్వే రాణిస్తే న్యూజిలాండ్ పని మరింత సులువుగా మారనున్నది.

### హెన్రిచ్ క్లాసెన్..

హెన్రిచ్ క్లాసెన్ ఉపఖండం పిచ్‌లపై బ్యాట్‌తో రానిస్తాడు. అది టీ20 అయినా.. వన్డే మ్యాచ్ అయినా గమనాన్నే మార్చగల సత్తా ఉన్న ఆటగాడు. బంతిని తేలిగ్గానే బౌండరీకి తరలిస్తాడు. పాక్‌తో జరిగిన ముక్కోణపు సిరీస్‌లో ఆడిన ఓ మ్యాచ్‌లో కేవలం 56 బంతుల్లోనే 87 పరుగులు చేశాడు. మొత్తం 58 మ్యాచుల్లో 44 కంటే ఎక్కువ సగటు, 117.44 స్ట్రయిక్ రేట్‌తో పరుగులు చేశాడు.

## చాంపియన్స్ ట్రోఫీ జలక్.. స్వదేశానికి భారత బౌలింగ్ కోచ్




**న్యూఢిల్లీ:** చాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత్ జలక్ తగిలింది. టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నే మోర్కెల్ .. తన స్వదేశానికి వెళ్లాడు. దుబాయ్ నుంచి అతను .. దక్షిణాఫ్రికాకు పయనం అయ్యాడు. మోర్కల్ తండ్రి కన్నుమూశాడు. దీంతో అంత్యక్రియల్లో పాల్గొనేందుకు అతను స్వదేశానికి వెళ్లినట్లు తెలుస్తోంది. సోమవారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌కు బౌలింగ్ కోచ్ మోర్కల్ హాజరుకాలేదు. మోర్కల్ మళ్లీ ఎప్పుడు జట్టుతో కలుస్తాడన్న క్లారిటీ లేదు. అతను లేకపోవడం వల్ల చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టుపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి. ఫిబ్రవరి 20వ తేదీన బంగ్లాదేశ్‌తో ఇండియా తొలి మ్యాచ్ ఆడనున్నది.

మూడు వారాలు సాగి చాంపియన్స్ ట్రోఫీ శనివారం నుంచి ప్రారంభంకానున్నది. కరాచీలో పాకిస్థాన్, న్యూజిలాండ్ మధ్య తొలి మ్యాచ్ ఉంటుంది. ట్రోఫీ కోసం మొత్తం 8 జట్లు పోటీపడుతున్నాయి. ఇండియా తన మ్యాచుల్ని దుబాయ్‌లో ఆడనుండగా, మిగితా జట్లు పాక్ వేదికల్లో పోటీపడనున్నాయి. 2017లో చాంపియన్స్ ట్రోఫీ పాకిస్థాన్ గెలుచుకున్నది.

## ప్రాక్టీస్ సెషన్‌లో చెమట చిందిస్తున్న కేఎల్ రాహుల్..

### చాంపియన్స్ ట్రోఫీలో ఇక దబిడి దిబిడే..!



**న్యూఢిల్లీ:** చాంపియన్స్ ట్రోఫీకి భారత జట్టు రెడీ అయ్యింది. దుబాయి వేదికగా బంగ్లాదేశ్‌తో గురువారం తొలి మ్యాచ్ జరుగనున్నది. ఆటగాళ్లు ముమ్మరం ప్రాక్టీస్ చేస్తున్నారు. వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ కేఎల్ రాహుల్ ఫామ్ భారత్‌కు కీలకం. ఈ క్రమంలో ముమ్మరంగా ప్రాక్టీస్ చేశాడు. రెండో సెషన్‌లో ప్రాక్టీస్‌లో భారీ షాట్లు ఆడడంపై దృష్టి పెట్టాడు. చాంపియన్స్ ట్రోఫీలో వికెట్ కీపర్‌గా కేఎల్ రాహుల్‌కు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తున్నది. ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌లోనూ కేఎల్ రాహుల్ కీపర్‌గా చేశాడు. సిరీస్ ముగిసిన తర్వాత హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ సైతం.. కేఎల్ రాహుల్ చాంపియన్స్ ట్రోఫీలో కీపర్‌గా బాధ్యతలు స్వీకరిస్తాడని తెలిపాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో మూడు మ్యాచుల్లో రాహుల్‌కు తుదిజట్టులో స్థానం దొరికింది. ప్రాక్టీస్ సెషన్‌లో దూకుడుగా షాట్లు ఆడడంపైనే దృష్టి పెట్టారు. మరో వైపు రిషబ్ పంత్ సైతం తుది జట్టులో సంపాదించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో వన్డేలో 29 బంతుల్లో 40 పరుగులు చేసిన రాహుల్ దాదాపు ప్రతి బంతిలోనూ సిక్సర్లు కొట్టడం ప్రాక్టీస్ చేస్తూ కనిపించాడు. రాహుల్ ఐదు, ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వస్తున్నాడు. ఈ క్రమంలో భారీ షాట్స్ ఆడేందుకు ప్రయత్నించాడు.

ఇటీవల శ్రేయాస్ అయ్యర్ సైతం బ్యాటింగ్‌లో దూకుడు పెంచాడు. ఇంగ్లాండ్‌పై సిరీస్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన ఓపెనర్ శుభ్‌మాన్ గిల్ ఫుల్ ఫామ్‌లో కొనసాగుతున్నాడు. అద్భుతమైన డ్రైవ్‌లు, ఫుల్ సహా అద్భుత షాట్లు ఆడాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో వన్డేలో 119 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి ఫామ్‌లోకి తిరిగి వచ్చిన భారత కెప్టెన్ రోహిత్ శర్మ సైతం తిరిగి ఫామ్‌లోకి వచ్చాడు. విరాట్ కోహ్లీ సైతం ముమ్మరంగా ప్రాక్టీస్ చేశాడు. ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాయి. ఆదివారం శిక్షణ సమయంలో హార్దిక్ పాండ్యా వేసిన బంతి షాట్ ఆడబోగా.. రిషబ్ పంత్ మోకాలికి తాకింది. దాంతో వికెట్ కీపింగ్, ఫీల్డింగ్ ప్రాక్టీస్‌కు వచ్చిన సమయంలో.. బ్యాటింగ్‌లో ఆ లయ కనిపించలేదు. అయితే, రిషబ్ పంత్‌ను టీమ్ మేనేజ్‌మెంట్ ఎలా ఉపయోగించకుంటుందనేది చర్చనీయాంశంగా మారింది. స్పెషలిస్ట్ కీపర్‌గా రాహుల్ తుది జట్టులోకి వస్తే.. పంత్‌ను స్పెలిష్ట్ బ్యాట్స్‌మెన్‌గా తీసుకుంటారా? లేదంటే ఇంగ్లాండ్‌తో సిరీస్ తరహాలోనే బెంచ్‌కే పరిమితమవుతాడా? వేచి చూడాల్సిందే.

# బీసీసీఐ యూటర్న్..

### ఛాంపియన్స్ ట్రోఫీ కోసం క్రికెటర్లు ఫ్యామిలీని తీసుకెళ్లొచ్చు..

**న్యూఢిల్లీ:** ఛాంపియన్స్ ట్రోఫీ కోసం టీమ్ ఇండియా ఆటగాళ్లు దుబాయ్ చేరుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం అక్కడ ప్రాక్టీస్‌ను కూడా మొదలు పెట్టారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీతోపాటు ఆటగాళ్లంతా నెట్స్‌లో చమటోడుస్తున్నారు. ఈ టూర్‌లో ఆటగాళ్లకు బీసీసీఐ పది షరతులు పెట్టిన విషయం తెలిసిందే.

ఇటీవల కాలంలో విదేశీ పర్యటనల్లో టీమ్ ఇండియా పేలవ ప్రదర్శన నేపథ్యంలో బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. బోర్డు నిర్ణయం ప్రకారం.. ఆటగాళ్లు కనీసం 45 రోజులు, అంతకంటే ఎక్కువ రోజులు విదేశాలకు వెళ్తేనే.. జట్టులోని సభ్యులతో వారి ఫ్యామిలీలు గరిష్టంగా రెండు వారాల పాటు ఉండేందుకు అనుమతి ఉంటుంది. అయితే, దుబాయ్ పర్యటనకు మాత్రం ఫ్యామిలీని అనుమతించలేదని వార్తలు వచ్చాయి.

అంతేకాదు వ్యక్తిగత సిబ్బందిని కూడా అనుమతించలేదని తెలిసింది. రోహిత్ సేన దుబాయ్‌లో మూడు మ్యాచ్‌లు మాత్రమే ఆడనుంది. ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో, ఫిబ్రవరి 23న పాకిస్థాన్‌తో, మార్చి 2న న్యూజిలాండ్‌తో తలపడనుంది. మొత్తం ఈ పర్యటన వ్యవధి మూడు వారాల కంటే కొంచెం ఎక్కువగా ఉండటంతో.. ఆటగాళ్లతో వారి కుటుంబాలను బీసీసీఐ అనుమతించలేదు. బీసీసీఐ నిర్ణయంతో ఇప్పటి వరకూ విదేశీ పర్యటనలకు కుటుంబాలతో సహా వచ్చిన క్రికెటర్లు ఈసారి సింగిల్స్‌గా రావాల్సి వచ్చింది.



అయితే, తాజాగా ఈ విషయంలో బీసీఐ యూటర్న్ తీసుకున్నట్లు తెలిసింది. ఆటగాళ్లకు కొంత మినహాయింపు ఇచ్చినట్లు సమాచారం. ఛాంపియన్స్ ట్రోఫీలో క్రికెటర్లు కుటుంబ సభ్యులను తీసుకెళ్లేందుకు అనుమతించినట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. అయితే, ఓ షరతు పెట్టినట్లు పేర్కొన్నాయి. ట్రోఫీ మొత్తంలో ఏదైనా ఒక మ్యాచ్ కోసం మాత్రమే కుటుంబసభ్యులను అనుమితిస్తారట. ఈ విషయంలో ఆటగాళ్లు చర్చించుకుని బీసీసీఐకి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఆటగాళ్ల అభ్యర్థన మేరకు బీసీసీఐ అందుకు తగిన ఏర్పాటు చేస్తుందని క్రికెట్ వర్గాలు వెల్లడించినట్లు మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి.

# కమల్ హాసన్‌ను ఆదుకున్న ఇళయరాజా



**టాకీస్:** ఇసై జ్ఞాని ఇళయరాజా బహుముఖ ప్రజ్ఞాశాలి. కమల్ హాసన్ సొంత అన్నలాగా భావిస్తారు. కమల్ హాసన్ స్టార్ గా ఎదిగే క్రమంలో ఘనవిజయం సాధించిన అనేక చిత్రాలు ఇళయరాజా స్వరకల్పనలో వెలుగు చూశాయి. కమల్ హాసన్ తమ 'రాజ్ కమల్' బ్యానర్ పై రూపొందించిన పలు చిత్రాలకు ఇళయరాజా స్వరాలతోనే సాగారు. కమల్ నిర్మాతగా రూపొందిన తొలి చిత్రం 'రాజాపారవై'కి, ఆ సినిమా తెలుగు వర్షన్ 'అమవాస్య చంద్రుడు' కు కూడా ఇళయరాజానే స్వరకల్పన చేశారు. ఆ తరువాత కమల్ నిర్మించిన చిత్రాలలో 'సతి లీలావతి' వరకు ఇళయరాజానే బాణీలు కట్టారు. 'ద్రోహి' సినిమాలకు కమల్ వేరే మ్యూజిక్ డైరెక్టర్స్ తో సాగారు. అలాగే తన దర్శకత్వంలో నిర్మించి, నటించిన 'హే రామ్' చిత్రానికి తొలుత ప్రఖ్యాత వయొలినిస్ట్ ఎల్.సుబ్రహ్మణ్యంతో మ్యూజిక్ కంపోజ్ చేయించారు కమల్. మరి టైటిల్స్ లో ఇళయరాజా పేరు కనిపిస్తుంది కదా! అదెలా అంటే అక్కడే ఉంది అసలు కథ. కమల్ హాసన్ సూచనల మేరకు ఎల్.సుబ్రహ్మణ్యం 'హే రామ్'కు బాణీలు కట్టారు. సుబ్రహ్మణ్యం స్వరాలతోనే సాగిన పాటలను కూడా చిత్రీకరించారు. అయితే ఫైనల్ సౌండ్ మిక్సింగ్ కు వచ్చే సరికి సుబ్రహ్మణ్యం పేచి పెట్టారు. తనకు కోటి రూపాయలు ఇస్తేనే చేస్తానని అన్నారు. సినిమా పూర్తయ్యే సమయానికి అంత సొమ్మును ఒక్క సంగీత దర్శకునికే చెల్లించే పరిస్థితి కమల్ వద్ద లేదు. దాంతో తాను అన్నగా అభిమానించే ఇళయరాజా వద్దకు వెళ్ళారు కమల్. సుబ్రహ్మణ్యం బాణీలతో రూపొందిన పాటల చిత్రీకరణ కూడా పూర్తయిందని, వాటిని తొలగించి, ఇళయరాజా ట్యూన్స్‌తో రూపొందే పాటలను మళ్ళీ షూట్ చేస్తానని కమల్ అన్నారు. అయితే మళ్ళీ అది కమల్‌కు ఖర్చుతో కూడుకున్న పని అవుతుంది కదా అని ఇళయరాజా ఓ ఆలోచన చేశారు. తెరకెక్కించిన ఆ పాటలను తొలగించకుండానే, సుబ్రహ్మణ్యం మ్యూజిక్ ఉపయోగించకుండా తన స్వరాలతో పాటలు కంపోజ్ చేస్తానని ఇళయరాజా తెలిపారు. అలా కమల్‌కు ఖర్చు పెరగకుండా ఇళయరాజా ఆదుకున్నారు.

## మీనాక్షి చౌదరి.. వయ్యారాల జాబిల్లి



**టాకీస్:** టాలీవుడ్ లో ఇటీవల కాలంలో బిగ్ ఛాన్సెస్ అందుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న అందాల భామ మీనాక్షి చౌదరి. "ఇచ్చట వాహనములు నిలుపరాదు" సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ సుందరి, ఆ తరువాత "హిట్ 2" చిత్రంతో మంచి గుర్తింపును సంపాదించుకుంది. ఇటీవల లక్కీ భాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలతో బాక్సాఫీస్ హిట్స్ అందుకొని టాప్ రేసులోకి వెళ్ళింది. గ్లామర్‌తో పాటు నటనకు కూడా ప్రాధాన్యం ఇస్తూ, కథానాయికగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకునే ప్రయత్నంలో ఉంది. ఇటీవలి కాలంలో ఆమె తన స్టైలిష్ లుక్స్, ట్రెడిషనల్ అండ్ మోడ్రన్ అవతారాలతో తరచూ సోషల్ మీడియాను హీటెక్కిస్తోంది. తాజాగా మీనాక్షి చౌదరి షేర్ చేసిన ఫోటోలు మరోసారి ట్రెండింగ్‌లోకి వచ్చాయి. సిల్క్ గ్రీన్ అండ్ వైట్ కాంబినేషన్ డ్రెస్సులో ఆమె న్యూ లుక్ తో అదరగొట్టేసింది. వెరైటీ ఆఫిట్, హై క్లాస్ జ్యూవెల్రీ, అందమైన కర్లీ హెయిర్ స్టైల్.. ఇవన్నీ ఆమె అందాన్ని మరింత హైలైట్ చేశాయి. ఫోటోషూట్‌లో కనపడిన ఆమె వైవిధ్యమైన ఎక్స్‌ప్రెషన్స్, మృదువైన హావభావాలు చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. ఈ లేటెస్ట్ స్టైలింగ్ వెనుక ప్రముఖ స్టైలిస్ట్ శ్రవ్య వర్మ సౌండ్ కాంబినేషన్ ఉంది. ఆమె డ్రెస్ ఎంపిక నుంచి హెయిర్ మేకోవర్ వరకూ ప్రతీ చిన్న విషయం మీద ఫోకస్ పెట్టడం కనిపిస్తోంది. ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్ ద్వారా ఎంపికైన అవుట్‌ఫిట్‌ను ఆమె ఎంతో గ్రేస్‌తో క్యారీ చేస్తూ ఫోటోలకు హైలైట్‌గా నిలిచింది. ఫోటోల్లో ఫ్లోరల్ జ్యూవెలరీ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇక అమ్మడి హవా చూస్తుంటే రాబోయే కాలంలో స్టార్ హీరోల సినిమాల్లో నటించే ఛాన్స్ ఉందని అనిపిస్తోంది. ఈ ఫోటోషూట్‌తో మరోసారి తన గ్లామర్ స్టేట్మెంట్‌ను హైలెట్ చేస్తూ, ఫ్యాన్స్ మనసులను కొల్లగొడుతోంది. మరి అమ్మడికి భవిష్యత్తులో ఇంకా ఎలాంటి అవకాశాలు అందుతాయో చూడాలి.

## పరమేశ్వరన్‌కు 'డ్రాగన్' బర్త్‌డే గిఫ్ట్ అయ్యేనా..?

**టాకీస్:** మలయాళ చిత్రం 'ప్రేమమ్'తో 2015లో చిత్రసీమలోకి అడుగుపెట్టిన అనుపమా పరమేశ్వరన్ ఈ దశాబ్ద కాలంలో దక్షిణాది భాషా చిత్రాలన్నింటిలోనూ నటించి నటిగా తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. మలయాళ సినిమాల్లో తొలిసారి నటించినా... ఆ తర్వాత సంవత్సరమే 'అ...ఆ'తో తెలుగు రంగంలోకి అడుగపెట్టింది. అంతేకాదు... మలయాళంలో 'ప్రేమమ్'లో చేసిన పాత్రనే తెలుగు రీమేక్ లోనూ చేసింది. 'అగరొత్తుల కురులే వలగ విసిరేసి' కుర్రకారు గుండెల్లో సెగలు రేపింది. అదే యేడాది 'కోడి' మూవీతో కోలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. దిల్ రాజ్ బ్యానర్ లో రూపుదిద్దుకున్న 'శతమానం భవతి' చిత్రం అనుపమా పరమేశ్వరన్ కు మంచి విజయాన్నే కాదు చక్కని పేరూ తెచ్చిపెట్టింది. ఈ సినిమా జాతీయ స్థాయిలో ఉత్తమ వినోదాత్మక చిత్రం అవార్డుతో పాటు రాష్ట్ర స్థాయిలో ఐదు నంది అవార్డులనూ గెలుచుకుంది. ఆ తర్వాత అనుపమా తెలుగులో చేసిన చిత్రాలేవీ పెద్దంత కమర్షియల్ సక్సెస్ సాధించలేదు. కానీ తమిళ రీమేక్ వచ్చిన 'రాక్షసుడు' ఫర్వాలేదనిపించింది. ఇక మూడేళ్ళ క్రితం వచ్చిన 'రౌడీ బాయ్స్' నుండి అనుపమా కాస్తంత



గ్లామర్ ట్రీట్ ఇవ్వడం మొదలెట్టింది. అప్పటి వరకూ పక్కింటి అమ్మాయిలా కనిపించిన అనుపమా కుర్రాళ్ళ డ్రీమ్ గర్ల్ గా మారిపోయింది. 'కార్తికేయ - 2'లో పద్ధతి గల పాత్ర చేసినా... 'టిల్లు స్క్వేర్'లో లిప్ లాక్స్ తో సందడి చేసేసింది. గ్లామర్ పాత్రలకు అనుపమా న్యాయం చేస్తుందని ఆ సినిమా నిరూపించింది. పద్ధతిగల పాత్రల మీదుగా అందాల ఆరబోతకు జండా ఊపేసిన అనుపమా పరమేశ్వరన్ 'బట్లర్ ఫ్లై' వంటి లేడీ ఓరియంటెడ్ థ్రిల్లర్ మూవీలోనూ నటించింది. అలానే థాట్ ప్రొవోకింగ్ షార్ట్ ఫిల్మ్ సైతం చేసింది. ఇప్పుడు కూడా తెలుగులో 'పరదా' సినిమాలో అర్థవంతమైన పాత్రను పోషించింది. ఇవే కాకుండా 'బైసన్', లాక్ డౌన్, పెట్ డిటెక్టివ్, మరీచిక' వంటి సినిమాలలో అనుపమా నటిస్తోంది. ఫిబ్రవరి 21న రాబోతున్న 'డ్రాగన్'లో అనుపమా పరమేశ్వరన్... ప్రదీప్ రంగనాధన్ సరసన నటించింది. ఇది కూడా యూత్ ఫుల్ ఎంటర్ టైనరే! 'లవ్ టుడే'తో ఇప్పటికే యూత్ ను అట్రాక్స్ చేసిన ప్రదీప్ రంగనాథన్ లేటెస్ట్ మూవీ 'డ్రాగన్' కూడా హిట్ అయితే... అది అనుపమకు అభిమానులు ఇచ్చిన బర్త్ డే గిఫ్ట్ అనుకోవచ్చు.

## ఫౌజీలో యువరాణిగా అలియాభట్

**టాకీస్:** అగ్ర కథా నాయకుడు ప్రభాస్, హను రాఘవపూడి కాంబోలో ఓ సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఫౌజీ అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతుండగా.. ఈ సినిమాలో హీరోయిన్‌గా ఇమాన్ ఎస్మాయిల్ నటిస్తుంది. ప్రతిష్టాత్మక మైత్రీమూవీమేకర్స్ నిర్మించనున్న ఈ సినిమాలో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నట్లు సమాచారం. అందుకే ఈ మూవీ టైటిల్ 'ఫౌజీ' అయితే బావుంటుందని బృందం భావిస్తున్నది. స్వాతంత్ర్యానికి పూర్వం జరిగే కథతో రానుండగా బ్రిటీష్‌వారి



సైనికుడిగా ఇందులో ప్రభాస్ కనిపించనున్నారట. విశాల్ చంద్రశేఖర్ ఈ సినిమాకు బాణీలు సమకూరుస్తున్నారు. అయితే ఈ సినిమాకు సంబంధించి ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాలో కీలకమైన బ్రిటిష్ యువరాణి పాత్రలో బాలీవుడ్ నటి ఆలియా భట్ నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. యువరాణి పాత్ర ఈ సినిమాలో కీలకం కావడంతో.. ఆలియా భట్‌ని తీసుకోబోతున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది. మరోవైపు ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ నటిస్తున్నాడు.

## అల్లు అర్జున్‌తో రొమాన్స్ చేయనున్న జాన్వీకపూర్

**టాకీస్:** ఐకాన్ స్టార్ అల్లుఅర్జున్ నటించిన పుష్ప-2 మూవీ బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. పుష్ప తర్వాత బన్నీ ఏం సినిమా చేయబోతున్నాడనే చర్చ సాగుతున్నది. సమాచారం మేరకు అల్లు అర్జున్ త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో ఓ సినిమా చేయనున్నాడనే వార్త తెగ వైరల్‌గా మారింది. అయితే, ఈ ప్రాజెక్టు కాస్త ఆలస్యమయ్యే అవకాశం ఉందని.. ఈ మూవీని పక్కన పెట్టి బన్నీ తమిళ ప్రముఖ దర్శకుడు అట్లీతో సినిమా చేయనున్నాడని ప్రచారం జరుగుతున్నది. ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ, అలనాటి అందాల తార శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్‌ను హీరోయిన్‌గా తీసుకోనున్నట్లు తెలుస్తున్నది. చాలారోజులుగా బన్నీతో అట్లీ సినిమా చేయాలనుకుంటున్నాడు. ఇద్దరి కాంబోలో హై యాక్షన్ సినిమా తెరకెక్కించనున్నట్లు టాక్ నడుస్తున్నది. త్వరలోనే వివరాలను ప్రకటించనున్నారు. ఇక అల్లు అర్జున్‌తో జాన్వీ కపూర్ రొమాన్స్ చేయనున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఈ విషయంపై ఇప్పటి





వరకు ఎవరూ అధికారిక ప్రకటన చేయలేదు. జాన్వీ కపూర్ తెలుగులో జూనియర్ ఎన్టీఆర్ 'దేవర' మూవీతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది.

## భాగ్యశ్రీకి వరుస ఆఫర్లు

**టాకీస్:** ఔరా అనిపించే ఔరంగబాద్ అందం భాగ్యశ్రీ బోర్సే బంపర్ ఆఫర్ కొట్టేసింది. తమిళ అగ్ర కథానాయకుడు సూర్య సరసన నటించే ఛాన్స్ ఈ ముద్దుగుమ్మని వరించినట్టు చెన్నై మీడియాలో బలంగా వార్తలొస్తున్నాయి. సూర్య కథానాయకుడిగా తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో సితార ఎంటైర్టైన్మెంట్స్ సంస్థ ఓ చిత్రాన్ని నిర్మించనుంది. జీవీ ప్రకాష్‌కుమార్ సంగీత దర్శకుడు. ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా ఖాయం అయ్యిందట. మే నెలలో షూటింగ్ మొదలు కానున్నట్టు సమాచారం. తొలి సినిమా 'మిస్టర్ బచ్చన్' ఫలితం ఎలా ఉన్నా.. భాగ్యశ్రీబోర్సే మాత్రం అందంతో మార్కులు కొట్టేసి యూత్‌ని కట్టిపడేసింది. అందుకే ఈ ముద్దుగుమ్మకు అవకాశాలు క్యూ కట్టాయి. ప్రస్తుతం సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్ హీరోగా తెరకెక్కుతున్న 'కాంత' సినిమాలో హీరోయిన్‌గా చేస్తున్నది భాగ్యశ్రీబోర్సే. రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్ఘీస్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. రామ్ పోతినేని హీరోగా 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' ఫేం మహేశ్‌బాబు తెరకెక్కిస్తున్న చిత్రంలోనూ భాగ్యశ్రీనే కథానాయిక.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.